విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

ఆదివారం 01 జూన్ 2025 8 పేజీలు

5న 'జీపీఐ' ఎదుట ధర్నా

నల్లబర్లి పొగాకు కొనుగోలుపై కంపెనీలు చేస్తున్న ఆలస్యానికి నిరసన : కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-చిలకలూరిపేట: నల్లబర్లీ పొగాకు రైతుల సమస్యలపై ఈ నెల 5న గుంటూరు జీపీఐ కార్యాలయం ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు కోరారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో నల్లబర్లీ పంటను సాగుచేయమని రైతులను ప్రోత్సహించిన జీపీఐ, ఇతర కంపెనీలు మొహం చాటివేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే బాపట్ల జిల్లాలో పొగాకు వేసి అప్పుల పాలైన ఇద్దరు కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, మరొక రైతు ఆత్మహత్యాయత్నం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిదగ్గర అప్పులవాళ్ళు నిలదీయటాలు, ప్రతినిత్యం వర్షాలనుంచి పంటను కాపాడుకోలేకపోవటం, వచ్చే సంవత్సరం ఏ పంట వేయలో అర్ధంకాకపోవడం, పిల్లల చదువులకు ఫైనాన్స్ కంపెనీలను బ్రతిలాడుకోడంతో సరిపోతున్నందని తెలిపారు. సరైన ధర ఇవ్వక, త్వరగా పాసులివ్వక క్వాలిటీ పేరుతో మంచి పొగాకును కూడా -మిగతా 2 లో ...

ఆర్థిక ఇబ్బందులున్నా పింఛన్ల పంపిణీ

మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రతి నెల రూ.2,700 కోట్లు, సంవత్సరా నికి రూ.33 వేల కోట్లను పేద, వృద్దులు, వితంతు వులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్ల రూపంలో అందజేస్తున్నారని ఈ విధంగా దేశంలో ఎక్కడా పింఛన్లు ఇవ్వడం లేదని అన్నారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన 95 వేల పింఛన్లను తమ ప్రభుత్వం జూన్ 12వ తేదీన లబ్ధి దారులకు పంపిణీ చేయనున్నామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తొలుత రాష్ట్ర మంత్రి మంగినపూడి బీచ్ లో మసుల ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. బీచ్‌లో ఏర్పాటు చేస్తున్న 100 అడుగుల జాతీయపతాకం పునాదిని ప్రారంభంలోగానే జెండాను ఏర్పాటు చేయాలని, బీచ్‌లో ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని,మసులా ఉత్సవాలు ప్రారంభంలోగా అన్ని పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. నగరంలోని చిలకలపూడి, మండలంలోని తాళ్ళపాలెం గ్రామంలోని స్నేహాలయ వృద్ధాశ్రమం లో శనివారం ఉదయం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, -మిగతా 2 లో ...

డీజీపీని కలిసిన సీపీ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం: రాష్ట్ర డీజీపీగా పూర్తి బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తాను విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖరబాబు శనివారం డీజీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సీపీతో పాటు డీసీపీలు కేజీవి సరిత, తిరుమల్లేశ్వరరెడ్డి, కే.ఎం.మహేశ్వరరాజులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకొని ఆరోగ్య సిరుల పంటను పొందేందుకు యోగా, ధ్యాన సాధనను తమ జీవితంలో భాగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు, కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు.

పొగాకుతో క్యాన్సరు ప్రభావం ఉందని, అవగాహన అవసరమని ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు అన్నారు. శనివారం ప్రపంచ నో టొబాకో డే సందర్భంగా హెచ్‌సీజీ క్యూరీ సిటీ క్యాన్సర్ సెంటర్, ప్రభుత్వ దంత వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో పొగాకు వాడకంతో వచ్చే దుష్ప్రభావంపై అవగాహ కార్యక్రమాన్ని దంత వైద్యశాల పరిసర ప్రాంతాల్లో నిర్వహించారు.

ఒకరోజు ముందుగానే

పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పంపిణీ కార్యక్రమంలో భాగంగా వృద్ధుల వద్దకు వెళ్లి పెన్షన్లను కలెక్టర్ లక్ష్మీశ పంపిణీ చేశారు. శనివారం సీసీఎల్‌ఏ, ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి -మిగతా 2 లో ...

అమరుల త్యాగాలతో

ఎరుపుకెక్కిన ఎర్రజెండా...

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్

విశాలాంధ్ర-వినుకొండ : ఎందరో అమరవీరుల ప్రాణత్యాగాలతో ఎరుపెక్కిన ఎర్రజెండా పేద ప్రజలకు నిరంతరం అండగా ఉన్నదని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలోని ఒకటవ వార్డులోనే రెండవ శాఖ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం బడుగు జీవుల విముక్తి -మిగతా 2 లో ...

2న ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పొన్నూరు : ఇళ్ల స్థలాల సాధన కోసం జూన్ 2వ తేదీన జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అన్నారు. శనివారం పొన్నూరు సీపీఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సీపీఐ పొన్నూరు నియోజకవర్గం

ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు పట్టణాలలో 2 సెంట్లు, పల్లెలలో 3 సెంట్లు స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాలలో 2 సెంట్లు, -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

5న 'జీపీఐ' ఎదుట ధర్నా

ప్రకన పడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రైతులు ఆవేదన వర్ణనాతీతమని చెప్పారు. ఈ నెల 24వ తేదీ ఆరుగురు మంత్రుల పంటల ధరల నిర్ణయాల కమిటీ మార్టూరు దగ్గర ఏర్పాటు చేసిన సమావేశం లో పొల్గొన్న పొగాకు కంపెనీలు మొదటి రకం రూ. 12వేలకు తగ్గకూడదని, రెండవరకం రూ. ఐదువేలకు తగ్గకూడదని ఒప్పుకొని ఇప్పుడు వచ్చి మాట మారుస్తున్నారని తెలిపారు. పొగాకు తప్పక కొంటామని, వేయమని రైతులచుట్టు తిరిగి నేడు పట్టించుకోని కంపెనీ యాజమాన్యాలను నిలదీయటానికి జూన్ ఐదోతేదీన గుంటూరు రింగ్ రోడ్ లోవిద్యానగర్ 3లైన్ లో గల జీపీఐ కార్యాలయం వద్ద దగ్గర జరిగే ధర్నాకు నల్లబర్లి,వైట్బర్లి, వర్జీనియా పొగాకు పంట సాగు చేసిన రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తరలిరావలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా పింఛన్ల పంపిణీ

జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు కలిసి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. తాళ్లపాలెం గ్రామంలోని 13వ వార్డులో దివ్యాంగులు లకు 6 వేలు చొప్పున, నగరంలోని 7వ డివిజన్లో దివ్యాంగులకు 10 వేలు చొప్పున, మంచానికే పరిమితమైన అప్పలరాజుకు 15 వేల రూపాయల పింఛన్లను అందచేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి వెసులుబాటు కల్పించుకుని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. జూన్లో తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని, ప్రతి కుటుంబంలో చదువుతున్న పిల్లలందరికి 15 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కూడా త్వరలో అమలు చేస్తామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంటివద్దనే పింఛన్లను పంపిణీ చేస్తున్నామని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వచ్చే అగస్టు 15వ తేదీన ప్రారంభించేందుకు విధి విధానాలు రూపొందిస్తు సన్నాహాలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదవారికి అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు, మెప్మా పిడి సాయిబాబు, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, తహసీల్దార్ హరినాథ్, స్థానిక ప్రముఖ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, బండి రామకృష్ణ, కుంచే దుర్గాప్రసాద్, మోటమర్రి బాబాప్రసాద్ తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ

జయలక్ష్మి , అధికారులతో కలిసి విజయవాడ అర్బన్ పరిధిలోని బృందావన్ కాలనీలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. వార్డు సచివాలయ కార్యదర్శులు, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియను పరిశీలించారు. కేటగిరీల వారీగా లబ్ధిదారులకు పెన్షన్ మొత్తం సరైనవిధంగా అందుతుందా.. లేదా? అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జి.జయలక్ష్మి మాట్లాడుతూ జూన్ 1న ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే మే 31న శనివారమే పెన్షన్లు అందించడం జరుగుతోందని.. ఎక్కడా ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్ల వద్దే అందిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఇళ్ల వద్ద పెన్షన్ల పంపిణీ సజావుగా సాగేలా చూస్తున్నారన్నారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారావు, యూసీడీ పీవో పి.వెంకట నారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

2న ధర్నా జయప్రదం చేయండి

పల్లెల్లో 3 సెంట్లు ఇవ్వటంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇవ్వడమే కాకుండా మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేసి, జీఓ విడుదల చేసిందన్నారు. ఆ జీఓ ప్రకారం అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పొన్నూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించడం జరుగుతుందన్నారు. అర్హులైన పేదలందరూ పొన్నూరు మండల కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాలు నెరవేర్చడంతో పాటు అర్హులైన పేదలకు పట్టణాలలో రెండు సెంట్లు, పల్లెలలో మూడు సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.5 లక్షలు ఇచ్చి పేదలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి షేక్ గౌస్, కె.రామారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలతో ఎరుపుకెక్కిన ఎర్రజెండా...

కోసం భూస్వాములు జమీందారులు జాగీర్దారులకు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో తమ విలువైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని బలహీన వర్గాలకు అండగా ఉండి వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ ఉన్నారని ఆయన అన్నారు. సమావేశానికి సోదాల సాంబయ్య అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, మండల కార్యదర్శి రాయబారం వందనం, కొప్పరవు మల్లికార్జున, షేక్ మస్తాన్ జల్లి వెంకటేశ్వర్లు సమావేశం అనంతరం మహాసభ నూతన కమిటీని ఎన్నుకున్నదికార్యదర్శిగాదార్ల సాంబయ్య, సహాయ కార్యదర్శులు గా తిరుమల శ్రీను, తిరుమల ఏసు ప్రేమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భూక్య బుజ్జమ్మ, మూడవతు తూని యా భాయ్, భూక్య కోటమ్మ భాయ్, భూక్య గాయత్రి, మూడవత్ భవాని, మూడావత్ మాధవి భాయ్, సీతమ్మ భాయ్, రాగుల తిరుపతయ్య, తిరుమల గోవిందు, స్వామి నాయక్ భూక్య, బందారు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి సాంకేతిక పరిజ్ఞానం అందజేయాలి : శివ రాజ్ సింగ్

విశాలాంధ్ర - ఘంటసాల: దేశ రైతాంగానికి సాగు సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వం అందచేయు పథకాలు రైతులకు అవసరమగు ఇతర సాంకేతిక సమాచారాన్ని శాస్త్రవేత్తల బృందం ద్వారా నేరుగా వారి వారి గ్రామాలకు చేరి అందించే విధంగా కేంద్ర వ్యవసాయ, సంక్షేమ శాఖ మంత్రి శివ రాజ్ సింగ్ చౌహాన్ నిర్దేశించారు. ఇందులో భాగంగా రైతులు ఖరీఫ్ కు ముందుగా చేపట్టవలసిన పనులు, మట్టి నమూనా పరీక్షలు, నేల ఆరోగ్యానికి అనుగుణంగా పోషక యాజమాన్యం, నూతన వంగడాలు, యాంత్రీకరణ, పంటల సాగు యాజమాన్య%శీ%, సస్యరక్షణ, నూతన సాంకేతిక పరిజ్ఞానం, పాడి పశువుల యాజమాన్యం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకి అందచేయు సబ్సిడీలు, వ్యవసాయం లో డ్రోన్స్ వినియోగం వంటి వ్యవసాయానికి సంభందించిన అంశాలను రైతులకు నేరుగా వారి గ్రామాలలో చర్చించనున్నారని కేవికే సమన్వయ కర్త డా. డి సుధా రాణి తెలిపారు. మే 29 నుండి జూన్ 12 వరకు జిల్లాలోని వివిధ గ్రామాలలో కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యం లో జరుగుతుందన్నారు. నేడు స్థానిక ఘంటసాల మండలం కొడాలి గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి కళ్యాణ మండపం ప్రాంగణంలో జరగనున్నదని, కావున రైతులందరూ సద్వినియోగపరచుకోవాలని కెవికె సమన్వయకర్త డా. డి సుధా రాణి తెలిపారు.

నగర ప్రజలకు సకాలంలో పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీషాతో కలిసి నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం సత్యనారాయణపురం పురుషోత్తమ వీధి, పరిసర ప్రాంతాల్లో పర్యటించి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. జూన్ 1 ఆదివారం కావటంతో ప్రజలకు ఎన్టీఆర్ భరోసా అందటంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగా మే 31 లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. సత్యనారాయణ పురం పురుషోత్తం వీధిలోని పెన్షన్ లబ్ధిదారుల ఆధార్ కార్డు పరిశీలించి, ఫేస్ రికగ్నిషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్) ద్వారా పరిశీలించి వారికి పెన్షన్ డబ్బులు అందజేసి అనంతరం వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతినెల పెన్షన్ వస్తున్నదీ, ఇంటికి వచ్చి ఇస్తున్నారా లేదా, ఎంత డబ్బులు ఇస్తు న్నారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉదయం ఆరింటికల్లా పెన్షన్ పంపిణీ మొదలుపెట్టాలని, పెన్షన్ పంపిణీలో ఎలాంటి అలసత్వం వహించరాదని, పెన్షన్ దారుల ఇంటి వద్దకు వెళ్లి ఖచ్చితంగా పెన్షన్ అందించాలని ఆదేశించారు.

పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం: సుదీర్ఘ కాలం క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందిన అధికారులకు, సిబ్బందికి అడ్మిన్ డీసీపీ కేజీవి సరిత ఆత్మీయ వీడ్కోలు పలికారు. శనివారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ మర్యాదలతో శాలువాతో సత్కరించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీ విరమణ పొందిన వారు: సిహెచ్.శ్రీనివాసరావు(ఎస్ఐ), బి.ఈ.వెంకటేశ్వర్రావు(ఎస్ఐ), ఎస్.సత్యనారాయణ(రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్), కేవీఎల్.నారాయణ(ఏఎస్ఐ), సయ్యద్ రియాజుద్దీన్(ఏఎస్ఐ), సిహెచ్. వెంకటేశ్వరరావు(ఏఎస్ఐ), బక్కా శ్రీనివాసరావు(హోంగార్డ్), కొల్లూరి నాగేశ్వరి (హోంగార్డ్) వీరిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్.ఏసీపీ డి.ప్రసాదరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ ఎం.సోమయ్య, అసోసియేషన్ సంఘ సభ్యులు, సీపీవో పాల్గొన్నారు.

రాజేంద్రప్రసాద్కు ఎన్టిఆర్ అవార్డు



విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ డాక్టర్ ఎన్.టి.రామారావు జయంత్యుత్సవాలను పురస్కరించుకొని ఎక్సరే సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ ప్రముఖ చలనచిత్ర నటుడు రాజేంద్రప్రసాద్ కు ఎన్.టి.ఆర్ అవార్డు ప్రదానం జరిగింది. శనివారం సాయంత్రం సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగేలా పురస్కార సభకు విచ్చేసిన అతిథులచే నట కిరీటి రాజేంద్ర ప్రసాద్ కు ఎక్సరే అధ్యక్షుడు కొల్లూరి సభాధ్యక్షునిగా ఆహూతుల హర్షధ్వానాల మధ్య అవార్డును అందించారు. సిరిపురపు పద్మజ జ్యోతి ప్రకాశనం చేయగా సభను అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ సభను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ లు మాట్లాడుతూ గౌరవ అతిథులుగా శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరావు, గద్దె రామ్మోహన్ లు, మూల్పూరి ఉపేంద్ర, కె వేణుగోపాలరెడ్డి, డాక్టర్ సిహెచ్ మనోజ్ కుమార్, ఆర్ మల్లికార్జునరావు, నూకల సాంబశివరావు ప్రత్యేక అతిథులుగా, మాగంటి కుమారమ్మ, డాక్టర్ గిడుగు లక్ష్మీదత్ హాజరై ఆంధ్రత్వం మూర్తీభవించిన ఎన్ టి ఆర్ నటునిగా, నాయకునిగా తెలుగుజాతి గర్వించదగిన మహోన్నతుడన్నారు. ఆయన కీర్తి అజరామరమని, తెలుగు భాషా మాధుర్యాన్ని అంతర్జాతీయంగా చాటి, తెలుగు భాషా వికాసానికి నిరంతరం కృషిచేసిన ఎన్ టి ఆర్ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు, ప్రజాసేవయే లక్ష్యమని నినదిస్తూ పాటుపడ్డారన్నారు.

సెక్యూరిటీ గార్డ్ దౌర్జన్యంపై మంత్రికి వినతి

విశాలాంధ్ర-మచిలీపట్నం : మచిలీపట్నం సరోజన ఆసుపత్రి సెక్యూరిటీ గార్డుల దౌర్జన్యాలపై మంత్రి కొల్లు రవీంద్రకు ప్రజా దర్బార్లో శనివారం యాదవ సంఘం ప్రముఖులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షులు పల్లపాటి చినబాబు మాట్లాడుతూ మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డ్ ల దౌర్జన్యం లు ఎక్కువైపోయాయని, రోగుల పట్ల, వారి బంధువుల పట్ల సెక్యూరిటీ గార్డులు విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తు దౌర్జన్యాలకు దిగుతున్నారని దీనిపై మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఇటువంటి మరల జరగకుండా మంత్రి తోపాటు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాసినపాడు గ్రామం నుంచి గత రాత్రి వైద్యం నిమిత్తం బత్రాజు నాంచారమ్మ ను మచిలీపట్నం ఆస్పత్రిలో చేర్పించడం జరిగిది. కాగా శుక్రవారం మధ్యాహ్నం రోగి భర్త బత్రాజు స్వాములు, కుమారుడు బత్రాజు అయ్యప్ప హోటల్ నుంచి భోజనం తెచ్చుకొని టు వీలర్ వెహికల్ ని పార్కింగ్ చేస్తుండగా,సెక్యూరిటీ గార్డ్ కిరణ్ వచ్చి బండి ఇక్కడ పెట్టకూడదు వేరే చోట పెట్టకోమని చెప్పగా మాకు తెలియదండి తీసేస్తున్నాము అని చెప్పి బండి తీస్తుండగా, ఎంతసేపురా మీరు బండి తీసేది అని దుర్భాషలాడి చేతిలో ఉన్న భోజనం పార్సిల్ ను లాక్కొని దూరముగా విసిరేసి, రోగి భర్త,కుమారునిపై దాడి చేసి,దౌర్జన్యం చేసినట్లుగా మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని ఆయన అన్నారు. బాధితులు పెడన నియోజకవర్గం బాసినపాడు గ్రామ వాస్తవ్యులు అవడంతో వారికి ఏమి చేయాలో తెలియక బందరు యాదవ సంఘం దృష్టికి తీసుకువస్తాం జరిగిందని ఆయన తెలిపారు. వెంటనే రాష్ట్ర గనులు,భూగర్భ, ఎక్సైజ్ శాఖ మాత్యులు మంత్రి కొల్లు రవీంద్ర వద్దకు బాధితులను తీసుకుని వెళ్లి మంత్రి కి అర్జీ ఇవ్వడం జరిగింది. దీనిపై మంత్రి తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని ఆయన అన్నారు. దేవన బోయిన వెంకట కృష్ణారావు, బోయిన అంతర్వేది,చేబోయిన కోటేశ్వరరావు,మేకపోతులు పవన్,పెద్ది పోయిన సాంబ పలువురు యాదవ ప్రముఖులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

పద్మావతికి సన్మానం

విశాలాంధ్ర-విజయవాడ: సీబీఐ కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పద్మావతి శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. అంతకు ముందు విశాలాంధ్ర దినపత్రిక ఇంజినీర్ గంపా శ్రీనివాసరావు తన చిన్ననాటి స్నేహితురాలిని హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

విశాలాంధ్ర-విజయవాడ: ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకొని ఆరోగ్య సిరుల పంటను పొందేందుకు యోగా, ధ్యాన సాధనను తమ జీవితంలో భాగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు, కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆయుష్‌శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో నిర్వహించిన రైతన్నల థీమ్ యోగా యోగా కార్యక్రమంలో డైరెక్టర్, కలెక్టర్, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెదితరులు పాల్గొని రైతులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా డిల్లీరావు మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సమాజంలోని ప్రతివర్గానికి యోగాను చేరువచేయాలనే ఉద్దేశంతో థీమ్ యోగా కార్యక్రమాలను నిర్వహించడం ఆనందంగా ఉందని, వీటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని యోగాను జీవితాంతం ఆచరించాలని సూచించారు. రైతన్నలు తమ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా మానసిక ఆరోగ్యం పరిపుష్టమవుతుందన్నారు. ధ్యాన సాధన, ప్రాణాయామం వంటి వాటిని ఆచరించాలని డిల్లీరావు సూచించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ యోగాంధ్ర మాసోత్సవాల్లోని 11వ రోజు కార్యక్రమాన్ని అన్నదాతలతో కలిసి నిర్వహించడం చాలా ఆనందం కలిగించిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. హలమే బలమై స్వేదం చిందించి సేద్యం చేసే అన్నదాతలు దేహ దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతతను చేకూర్చే యోగాకు చేరువకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, ఆయుష్ అధికారి డా. రామతులసి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, డా. జె.సుమన్, డా. రత్నప్రియదర్శిని, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్‌ను తిరిగి ఇచ్చిన పోలీసులు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఆటోలో ప్రయాణిస్తూ బ్యాగ్ మరిచిపోయి వెళ్ళిన మహిళకు తిరిగి ఆ బ్యాగ్‌ను అందజేయటం జరిగిందని అందుకు ఆటో డ్రైవర్‌ను అభినందించి సత్కరించామని జి.ఆర్.పి సిఐ జె.వి.రమణ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ప్రకారం ఉదయం రైలు దిగిన మంగళ పూడి మనీషా అనే ప్రయాణికురాలు ఒక ఆటోలో తన బ్యాగ్ ను ఆటో లొ మర్చిపోవడం జరిగిందన్నారు.ఆటో డ్రైవర్ ఆ బ్యాగ్‌ను విజయవాడ రైల్వే పోలీసులకు తీసుకువచ్చి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. అలాగే ఆటో డ్రైవర్‌ను అభినందించి సత్కరించామని సిఐ తెలిపారు. రైల్వే డి.ఐ.జి బి.సత్య ఏసుబాబు అదేశాలు మేరకు రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్,రైల్వే డిస్పీ జి.రత్నరాజు సూచనలు మేరకు గతంలో తాము రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని ఆటో స్టాండ్స్ యూనియన్స్ కు ప్రయాణికులు ఏ విధమైన బ్యాగులులు,సెల్‌ఫోన్‌లు ఇతర విలువైన వస్తువులు మరచి వెళ్ళిపోయినప్పుడు వాటిని రైల్వే పోలీసులకు అప్పగించాలని ఆలా అప్పగించిన ఆటో డ్రైవర్స్ ను అభినందించడంతోపాటు ప్రశంస పత్రాలు కూడా ఇవ్వబడునని అవగాహన క్యాంపులు ద్వారా తెలియజేశామన్నారు.దాని ఫలితంగా మనీషా బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోవటం ఆ బ్యాగ్‌ను ఆటో డ్రైవర్ భద్రంగా రైల్వే పోలీస్‌లకు అప్పగించటం జరిగిందన్నారు.

హెచ్‌బీ కాలనీలో పెన్షన్ పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ హెచ్‌బీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం ఉదయాన్నే ప్రారంభమైంది. జూన్ ఒకటి తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందు గానే పింఛన్లు అందచేస్తున్నారు. ఈక్రమంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 125 సచివాలయం సెక్రటరీ సుధ ఉదయన్నే హౌసింగ్ బోర్డ్ కాలనీలో పింఛన్లు పంపిణీ చేశారు.

రేపూడి తండాలో కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర-ఎ.కొండూరు : తిరువూరు సీఐ కె. గిరిబాబు ఆధ్వర్యంలో తిరువూరు, ఎ.కొండూరు పోలీసులు శనివారం ఎ.కొండూరు మండలం రేపూడి తండా గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. నాటు సారా నిర్మూలన నిమిత్తం గ్రామంలో కాటన్ సెర్చ్ నిర్వహించినట్లు సిఐ గిరిబాబు తెలిపారు. గ్రామంలో ఎటువంటి సారా నిల్వలు లభ్యం కాలేదని, సరైన రికార్డులు లేని 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని ఏ కొండూరు పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగిందని తెలిపారు. నాటు సారా తయారుచేసినా విక్రయించినా చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ కార్డులతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ రద్దు చేయిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎ. కొండూరు ఎస్సై చల్లా కృష్ణ, తిరువూరు ఎస్సై కె.వి జీవి సత్యనారాయణ, ఏఎస్ఐ వెంకట మహాలక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పైపు పగిలి వృథాగా తాగునీరు

విశాలాంధ్ర-వీరులపాడు : తాగునీరు పైపులు పగిలి పొయి కాలువలను తలపిస్తూ వృథాగా పోతున్నా పట్టీ పనట్లుగా నిర్లక్ష్యం వహిస్తున్న వీరులపాడు మండల ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ,సిబ్బంది. ఈ ఏడాది మండు వేసవిలో సైతం వర్షాకాలాన్ని తలపిస్తూ వర్షాలు కురిసి తాగునీటికి ఇబ్బంది లేకుండా కాలం గడిచిపోయింది. ఈ విషయంపై ప్రజలు పెద్దగా ఇబ్బంది పడినట్లుగా కనిపించలేదు. కానీ మండలంలోని గ్రామాలకు త్రాగునీరును అందించేందుకు ఏర్పాటుచేసిన పైపుల నిర్వహణ విషయంలో మాత్రం వీరులపాడు మండల ఆర్డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం మాత్రం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ విషయంపై అధికారులు స్పందించి తాగునీటి సమస్య ఏర్పడక ముందే పైపులకు మరమ్మతులు చేయించి త్రాగునీటి సమస్యకు గురికాకుండా చూడవలసినదిగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఫెయిల్యూర్ కూటమి ప్రభుత్వం

సంబరాలకే పరిమితమవుతున్న నారా లోకేష్

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏం సాయికుమార్

విశాలాంధ్ర-విజయవాడ: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ఫెయిల్యూర్ కాలేదని, కూటమి ప్రభుత్వం మాత్రమే ఫెయిల్యూర్ పాలన అందిస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏం సాయికుమార్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పదవ తరగతి పరీక్షా ఫలితాలు ఏప్రిల్ 23వ తారీఖున విడుదల చేశారని గుర్తు చేస్తూ ఈ ఫలితాల్లో చాలామంది విద్యార్థులు ఫీల్ అవ్వడంతో పాటు మార్కులు కూడా తక్కువగా వచ్చాయని ఆత్మహత్య ప్రయత్నాలు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పది పరీక్ష ఫలితాలు ఎన్నడు లేని విధంగా పరీక్ష పూర్తి అయిన 22 రోజులకే ఫలితాలు విడుదల చేశామని గొప్పలు చెప్పుకున్నారని అన్నారు. ప్రచారం ఆర్భాటంలో ఉన్న శ్రద్ధ విద్యార్థులకు సరైన ఫలితాలు ఇవ్వడంలో విఫలం చెందారని ఆరోపించారు. చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 66,363 మంది విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారని, అందులో ఇప్పటికే 11,000 మంది విద్యార్థులకు పైగా ఫెయిల్ అయిన వాళ్లు ఉత్తీర్ణులు అయ్యారని ముఖ్యంగా మార్కులు శాతం కూడా పెరిగాయని చెప్పారు. మీరు తీసుకున్న నిర్ణయం వల్ల చాలామంది విద్యార్థులు త్రిబుల్ ఐటీ లో సీట్లు కూడా కోల్పోయినట్లు విద్యార్థులే స్వయంగా చెబుతూ బాధను ప్రభుత్వానికి తెలియపరిచారని అన్నారు. కానీ ఇప్పటివరకు ఎక్కడ కూడా సంబంధిత మంత్రి విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యల పై స్పందించిన దాఖలాలు లేవన్నారు.

చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన

విశాలాంధ్ర-విజయవాడ: నగరంలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులలో భాగంగా శనివారం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి కె నాగరాజు తెలిపారు. ఈ పోటీలకు దాదాపుగా 50 మందికి పైగా విద్యార్థులు పాల్గొని చిత్రలేఖనంపై తమ ప్రతిభను కనుబరిచారని తెలిపారు. పర్యావరణపై అవగాహన పెంపొందించుకునేందుకు విద్యార్థులకు దోహదపడ్డాయని తెలిపారు. విజేతలైన విద్యార్థులకు ఈ నెల 7వ తేదీన శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా బహుమతులు ప్రధానం చేయడం జరుగుతోందన్నారు. ఈ పోటీలను డ్రాయింగ్ టీచర్ స్వాతి పూర్ణిమ పర్యవేక్షణలో జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేధింపులకు గురుచేశారు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : నిరక్షరాస్యతతో తన కూతురు అల్లుడు తాము కాంట్రాక్ట్ ప్రాతిపదికన చేస్తున్న ఉద్యోగాలను మోసం చేసి అక్రమంగా వారు కొనసాగుతున్నారని దీనికి కొంతమంది అధికారులు అండగా ఉంటున్నారని దీంతో తాము కుటుంబ పోషణ లేకుండా బిక్షం ఎత్తుకొని జీవిస్తున్నామని దీనిపై జిల్లా కలెక్టర్ కూడా ఫిర్యాదు చేశామని తమకు న్యాయం చేసి ఆ ఉద్యోగాలను తమకు ఇప్పించాలని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన మక్కల రాములమ్మ కన్నీటి పర్యాంతం అయింది. శనివారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమె మాట్లాడుతూ తాము జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయంలో 26 సంవత్సరాలుగా అవుట్‌సోర్సింగ్ కింద పారిశుద్ధ్య కార్మికులగా తాను తన భర్త పని చేస్తున్నామన్నారు. అయినా ఇంతవరకు దానిపై తగిన చర్యలు తీసుకోలేదని జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేసి తమ ఉద్యోగాలను తమకు ఇప్పించడంతోపాటు ఇటువంటి అక్రమాలకు పాల్పడిన తమ కూతురు అల్లుడు పై చర్యలు తీసుకోవడంతో పాటు దీని సకహకరించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

CHANGE OF NAME

I, **VENNA HIMABINDU (New Name),** W/o. Venkatesh Sakshi, have change my name **SAKSHI HIMABINDU (old name)** to **VENNA HIMABINDU.** D.No. 32-13-53/33, Sunnapubattila Center, Moghalarajapuram, Vijayawada-520010, NTR District. A.P. I have change my name as **VENNA HIMABINDU (New Name).**

మంగినపూడి బీచ్‌లో వెయ్యి మందితో యోగా



విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం మంగినపూడి బీచ్ వద్ద సుమారు వెయ్యి మందితో పెద్ద ఎత్తున యోగా ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు, జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు తదితరులు పాల్గొని యోగా ప్రియులను ఉత్సాహపరిచారు. పచ్చని తివాచీపై యోగా అనే ఆంగ్ల అక్షరాలతో ఏర్పాటు చేసిన అక్షరాకృతులలో యోగా ప్రియులను కూర్చొబెట్టి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక నుండి అంతర్జాతీయ యోగా శిక్షకులు శిరీష, పోతన శాస్త్రి సూచనలు చేస్తూ ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలు వేయించి, యోగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాన్ని డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు అధికారులు అవసరమైన ఏర్పాటు చేసి రాగిజావ, తాగునీరు, స్నాక్స్ అందించారు. అనంతరం రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ యోగా విశిష్టతను ప్రజలందరికి తెలియజేసేందుకు కార్యక్రమాలను ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కృష్ణాజిల్లా యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏపిఎస్ ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా ఇంటివద్దనే ప్రతిరోజు యోగా సాధన చేయడం ద్వారా మంచి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చని, ప్రతి ఒక్కరూ దీనిని అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు మాట్లాడుతూ ప్రజలందరూ యోగ పట్ల మక్కువ పెంచుకోవాలని, ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రయోజనాలు పొందాలని ఆయన కోరారు. అంతర్జాతీయ యోగా శిక్షకులు శిరీష వేదికపై పలు యోగాసనాలు వేసి ప్రజలను అబ్బురపరిచారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ ఇరువురు యోగా శిక్షకులును శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ కే. చంద్రశేఖర రావు, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, బందరు ఆర్డీఓ కే. స్వాతి, ఏఎస్పీలు సత్యన్నారాయణ, వివి. నాయుడు, బందరు డిఎస్పీ చప్పిడి రాజా, కూటమి నాయకులు బండి రామకృష్ణ, కుంచె నాని, మోటమర్రి బాబాప్రసాద్, గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపిపి కాగిత వెంకటేశ్వర రావు, కమిషనర్ బాపిరాజు,, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, జిల్లాలోని పలు ప్రాంతాల నుండి తరలి వచ్చిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ: పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. శనివారం కోడూరులో ఆయన పర్యటించారు. సంత మార్కెట్ ఆవరణ పరిశీలించారు. ప్రతి వారం సంత జరిగిన తరువాతి రోజు ఉదయాన్నే మార్కెట్ ఆవరణ శుభ్రం చేయించేలా పంచాయతీ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎంపీడీఓ జి.సుధాప్రవీణుకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇద్దరు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద పింఛన్లు అందచేశారు.

పేదలకు కంచునుగా పెంచన్ ఇస్తున్నాం

కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే పింఛన్ లబ్ధిని పెంచి అమలు చేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకల పూడి పాపారావు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ మణీంద్ర, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం

విశాలాంధ్ర-గన్నవరం: పేద ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసేది భారత కమ్యూనిస్ట్ పార్టీ అని గన్నవరం నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు అన్నారు. శనివారం మండలంలోని తేలప్రోలులో శనగల సుబ్బారెడ్డి అధ్యక్షతన గ్రామ శాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ శాఖ కార్యదర్శులు గ్రామ సమస్యలపై దృష్టి పెట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. సభ్యులు నేటి రాజకీయాలపై అవగాహన కలిగిఉండాలని అన్నారు. 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన సీపీఐ బడుగు జీవుల కోసం ఎన్నో పోరాటాలు చేసిందని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యం పోగాకును కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కాట్రగడ్డ రామచంద్ర జోషి, కట్టవరపు విజయరావు, చాగంటిపాటి వెంకటేశ్వరరావు, బాణముక్కల పుల్లారావు, నరసింహారావు, వై వినోద్‌కుమార్, లాం సన్ దీప్ రత్నకుమార్, రాజేష్, కిరణ్, కామేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

విశాలాంధ్ర-పెడన: చెన్నూరు జెడ్పీ పాఠశాలలో ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ఘన సన్మానం తో పాటుగా నగదు బహుమతిని ఇవ్వడం జరిగింది. జిల్లాలోనే అత్యుత్తమ మార్కులు సాధించిన పుప్పాల భోవనేశ్వరి (589) ప్రథమ బహుమతి కింద రూ.20వేల నగదు బహుమతి ఇవ్వడం జరిగింది.అదే మాదిరిగా రెండవ స్థానం సాధించిన యర్రంశెట్టి జాహ్నవి (582) 15 వేల రూపాయలు ద్వితీయ బహుమతిగా ఇచ్చారు.

వెలమలకు ప్రాధాన్యత కల్పించండి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీ నగర్) : రాష్ట్రంలో 50 లక్షల పైబడి జనాభాకలిగిన వెలమ సామాజిక వర్గానికి ఆర్థిక, సామాజిక, విభిన్నరంగాల్లోను, నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వెలమ సామాజిక వర్గాన్ని బిసిడి జాబితా నుంచి బిసి ఏ జాబితాలోకి మార్చాలన్నారు. యడిచర్ల వెంకటేశ్వరరావు,నూకారపు మాధవరావు, దుర్గా ప్రసాద్, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర, ఉయ్యూరు : ప్రతి మనిషిలోని ప్రతిభను విద్యార్థుల్లో మెరిట్ ను ప్రోత్సహించడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగ సుబ్రహ్మణ్యం అన్నారు. డీఎస్సీ నర్సింగ్ విద్యలో మెరిట్ సాధించిన డి. హేమకు శనివారం జరిగిన కార్యక్రమంలో రూ. 10 వేల నగదు పురస్కారాన్ని ఆయన అందించారు దాత జి.బసంతికి తోడ్పడగా ఈ కార్యక్రమంలో కెసిపి జనరల్ మేనేజర్ వి.వి పున్నారావు పలువురు రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

యోగాతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర, ఉయ్యూరు : యోగతో మానసిక ఉల్లాసం శారీరిక ఆరోగ్యం పొందవచ్చునని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జివిస్వి శేషగిరిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో యోగ శిక్షణ తరగతుల్లో శనివారం ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగా ఆంధ్ర కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఇంటింటా యోగ సాధన జరగాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి శేషగిరిరావు,యోగ శిక్షకులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మొవ్వ మండలంలో 95%కు పైగా పింఛన్లు పంపిణీ



విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వమండలంలో మే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ శనివారం 95 శాతానికి పైగా పంపిణీ చేశారని ఎంపీడీవో జె విమాదేవి వెల్లడించారు. మండలానికి 8388 మంది పెన్షన్ దారులకు రూ.3,60,37,500 విడుదలైనాయి. నాయకులు పాల్గొని దగ్గరుండి పంపిణీ చేయించారు.

2న నదీజలాల పరిరక్షణ కోసం జల, జన జాగరణ యాత్ర

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : తాగు, సాగు నీటి సంరక్షణకు, డెల్టా భూములు నదీజలాల పరిరక్షణ కోసం రాజకీయాలకు,కులమతాలకు అతీతంగా భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జల, జన జాగరణ యాత్ర జూన్ 2 (సోమవారం) ఉదయం 8 గం.కు యనమలకుదురు రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నుండి ప్రారంభింస్తున్నట్లు అనుమోలు గాంధీ తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ . కృష్ణా నది పరివాహక ప్రాంతాలలో జరుగుతున్న కాలుష్యం, అక్రమ నిర్మాణాలు, ఇసుక తవ్వకాలు, మడ అడవుల నాశనం వంటి కార్యకలాపాలు ప్రజల ఆరోగ్యానికి, వ్యవసాయానికి తీవ్ర ప్రమాదాన్ని కలిగిస్తున్నాయి దానిలో భాగంగానే కృష్ణానది డెల్టా ప్రాంతాన్ని మొత్తాన్ని పర్యటించి సమస్యలపై జన జాగరణ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ నిర్ణయం తీసుకుందన్నారు. అవనిగడ్డలో నీటి సంబంధిత సమస్యలను పరిశీలించిన తర్వాత యాత్ర కోడూరు, హంసలదీవి, తదుపరి సముద్రతీరాన్ని అనుసరిస్తూ మచిలీపట్నం, బంటుమిల్లి మీదుగా కృతివెన్నుకు కొనసాగుతుంది. ప్రజలు,రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెడసాని విజయభాస్కర్, క్రాంతి కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

పేదలకు సమగ్రంగా సేవలందించాలి

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: పేదలకు ఆహారభద్రత కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న రేషన్ దుకాణాల్లో సమర్ధవంతంగా సేవలందించాలని తిరువూరు ఆర్డీవో మాధురి సూచించారు. విస్సన్నపేటలోని పౌరసరఫరాలశాఖ గోదామును శనివారం ఆమె పరిశీలించారు. ఆదివారం నుంచి రేషన్ దుకాణాలను తెరిచి, పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేయాలన్న లక్ష్యం మేరకు ఈ పరిశీలన చేపట్టారు. తహశీల్దారు కె.లక్ష్మీకల్యాణి, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పది' విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం



విశాలాంధ్ర-అవనిగడ్డ: కోడూరు ఎస్సీ కాలనీకి చెం దిన పదో తరగతి విద్యార్థిని బత్తుల ప్రవల్లికకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రూ. 10వేలు నగదు ప్రోత్సాహకం అందించారు. దివిసీమ భీమ్ జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది 578 మార్కులు సాధించిన కోడూరు స్వతంత్ర్యపురం హైస్కూల్ విద్యార్థిని ప్రవల్లికకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మీదుగా నగదును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పోలబత్తిన గోపాలం, విద్యార్థిని తండ్రి రాజు పాల్గొన్నారు.

ఇనుపరేకుల వంతెన పనులు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వమండలం కాజలో అయినంపూడి డ్రైన్ పై పుష్కర కాలం క్రితం నిర్మించిన బెయిలి(8 రేకులు)బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతోపునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయంగా మారడంతో ఆ ప్రాంత వాసులు ఎంపీటీసీ వెంకటలక్ష్మి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా దృష్టికి తీసుకురావడంతో దీని అభివృద్ధికి రూ.41 లక్షలు కేటాయించారు. పనులు ప్రారంభించారు.

ఏఐబిఎస్పి నేషనల్ కోఆర్డినేటర్‌గా రిటైర్డ్ డిజిపి డాక్టర్ జె పూర్ణచంద్రరావు

విశాలాంధ్ర-విజయవాడ (ఇందకీలాద్రి): ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ గా రిటైర్డ్ డిజిపి డాక్టర్ జె పూర్ణచంద్రరావు ఏపీ కోఆర్డినేటర్ గా బక్కా పరంజ్యోతి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులుగా లక్కే రాజారావులు నియమితులైనారు. నగరంలో ఏఐబిఎస్పి ఆవిర్భావ సభ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన నియామకాలలో భాగంగా నూతన నియామకాలు జరిగినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. బిఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం ఆశయాలకు విరుద్ధంగా మాయావతి అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని, కాన్షీరాం సిద్ధాంతాలకు అనుగుణంగా ఆయన ఆశయాలను సాధించేందుకు నూతన పార్టీ ఆవశ్యకత ఏర్పడిందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల రాజ్యాధికారమే ధ్యేయంగా నూతన పార్టీ పనిచేస్తుందని, 2029 ఎన్నికల నాటికి గ్రామస్థాయిలో కమిటీలను వేసి గెలిపే ధ్యేయంగా పనిచేస్తామని ఏఐబిఎస్పి నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ జె పూర్ణచంద్రరావు ప్రకటనలో తెలిపారు.

విజ్ఞాన్స్ విద్యార్థికి పీహెచ్‌డీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కన్వెన్షనల్ ఇంజినీరింగ్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన బోత్రా వినయ్ కుమార్ జైన్ అనే విద్యార్థికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పెర్ఫార్మెన్స్ అండ్ మైక్రోస్ట్రక్చరల్ క్యారక్టరైజేషన్ ఆఫ్ ఫ్లయాష్ అండ్ జీజీబీఎస్ బేస్డ్ జియోపాలిమర్ మోర్టర్' అనే అంశంపై పరిశోధన చేసారని తెలియజేశారు. ఈ విద్యార్థికి విజ్ఞాన్స్ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలోని స్వర్గీయ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రూబెన్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. జైన్‌ను విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

అనూష మృతిపై విచారణ జరిపించాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు వారి తోటకు చెందిన రజక మహిళ తోరటి అనూష అనుమానస్పద మృతి పై విచారణ జరిపి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని రజక వృత్తి ధోబీ ఘాట్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చెన్నూరి చెన్నయ్య కోరారు. మహిళా కమిషన్ కార్యాలయంలో చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ అనూష ఆరోగ్యం సరిగా లేదని ఆమె ఎటువంటి ప్రయాణం చేయరాదని వైద్యులు చెప్పినప్పటికీ అనూషను ఆమె భర్త చెన్నై నుంచి గుంటూరు తీసుకురావడం జరిగిందన్నారు. కాన్పు సమయంలో మొదట బిడ్డ అనంతరం తల్లి ఇద్దరు చనిపోయారని అన్నారు. అనూష భర్త, గుంటూరులో చికిత్స చేసిన వైద్యురాలిపై కేసు నమోదు చేయాలని, ఆమె కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. అనూష కుటుంబ సభ్యులు తోరటి సామ్రాజ్యం, సాంబశివరావు, సత్తెనపల్లి రాంబాబు పాల్గొన్నారు.

ఎద్దులను తరలిస్తున్న వ్యక్తిపై కేసు

విశాలాంధ్ర-పెదనందిపాడు : మండల పరిధిలోని పాలపర్రు గ్రామం నుంచి లారీలో శనివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఎద్దులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు స్థానిక తహశీల్దార్ బి.వెంకటస్వామి, ఎస్సై మధుపవన్‌లు మార్గమధ్యంలోని ఎన్ఎబీ కోల్డ్‌స్టోరేజి వద్ద లారీని ఆపి పరిశీలించారు. అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారని నిర్ధారించుకొని పాలపర్రు గ్రామానికి చెందిన పెద్దిపాగ శేఖర్‌పై జంతు సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి షాపుల వద్దే రేషన్

విశాలాంధ్ర-పెదనందిపాడు : నేటి నుంచి మండల వ్యాప్తంగా రేషన్ షాప్‌ల వద్దే రేషన్ పంపిణీకి అన్ని చర్యలు తీసుకున్నట్లు తహశీల్దార్ బి.వెంకటస్వామి తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రేషన్ పంపిణీ జరపాలని, దివ్యాంగులకు, 65 సంవత్సరాలు దాటిన వారికి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ షేక్ కరిముల్లా, డీలర్లు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలి

విశాలాంధ్ర-మంగళగిరి : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, నెరవేర్చకపోతే ప్రజలు మార్పు కోరుకుంటారని ఏఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు అన్నారు. మంగళగిరిలో గల ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చారని, వాటిల్లో పెన్షన్ మాత్రమే అమలు చేస్తున్నారని అన్నారు. మిగతావి అమలు చేయడం లేదని విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి 11 సంవత్సరాల క్రితం 33 వేల ఎకరాలు భూములు ఇచ్చారని అన్నారు. వాటిని అభివృద్ధి చేయకుండా మరల భూ సమీకరణ పేరుతో గ్రామాల గ్రామాలు భూమిని తీసుకోవడం సరికాదని అన్నారు. భూ సేకరణ ద్వారా భూమిని తీసుకొని రైతులకు న్యాయం చేయాలన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం టీడీపీ ఎంపీలపై ఆధారపడి ఉందని, అవసరమైతే ప్రధానమంత్రి పదవి చంద్రబాబు నాయుడు అడగాలని చెప్పారు. మంత్రి నారా లోకేష్ టీడీపీ అభివృద్ధికి పనిచేయటం కాదని, పదవులు ఉన్నా లేకపోయినా పార్టీ అభివృద్ధికి పనిచేసి ముఖ్యమంత్రి పదవిని తీసుకోవాలని కోరారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇవి సాధ్యపడతాయన్నారు. ప్రత్యేక హోదా గురించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర అభివృద్ధికి, రాజధాని అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఎస్పీపై చర్యలు చేపట్టాలి : ప్రజా సంఘాలు

విశాలాంధ్ర-పొన్నూరు: తెనాలి పట్టణంలో ముగ్గురు యువకులను నడిరోడ్డుపై పట్టపగలు ఉమానుషంగా చిత్రహింసలు గురిచేసినా పోలీసులపై చర్యలు చేపట్టాలని ఏపీ సిఎల్‌సి నాయకులు డాక్టర్ టి రాజారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని మానవ హక్కుల వేదిక కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రజల రక్షణ కొరకు పోలీసు వ్యవస్థ ఏర్పడిందని పోలీసులే బహిరంగంగా ప్రజలను చిత్రహింసలకు గురి చేయటం దారుణమని అన్నారు. యువకులు ఎలాంటి నేరస్తులైన చట్ట ప్రకారం శిక్షించాలన్నారు. యువకులను శిక్షించిన పోలీసు అధికారులపై జిల్లా ఎస్పీ సానుకూలంగా మాట్లాడటం చట్ట విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలను మానవ హక్కులను ఉల్లంఘిస్తూ ప్రజల ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్న పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఉన్నత న్యాయస్థానంలో కూడా సుమోటోగా ఈ కేసును స్వీకరించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు జి.ఎస్ రాయల్, కేవీపీఎస్ నాయకులు తోడేటి శ్రీనివాస్, న్యాయవాది ప్రకాష్ పాల్గొన్నారు.

బోరుపాలెంలో మురుగునీటి కాటు

విశాలాంధ్ర-తుళ్లూరు : బోరుపాలెం గ్రామంలోని దళిత కాలనీలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లు జలమయమయ్యాయి. పారుదల సరిగా లేకపోవడం వల్ల మురుగునీరు వీధులన్నీ నింపి నిలిచిపోయింది. ఈ నీటి నిల్వల కారణంగా చిన్నపిల్లలు విష జ్వరాలతో బాధపడుతున్నారు. పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గ్రామస్తులు సమస్యను మండల అభివృద్ధి అధికారి శిల్ప దృష్టికి తీసుకెళ్లగా, పంచాయతీల వద్ద నిధులేమీ లేవు, ఈ సమస్యను సీఆర్డీఏ పరిష్కరించాలంటూ చేతులెత్తేశారు. సీఆర్డీఏ అధికారులు తక్షణమే స్పందించి, దళితులు నివసించే ఈ కాలనీకి విచ్చేసి పరిస్థితిని సమీక్షించి, మురుగునీటి నిల్వ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో చిన్నారులు విష జ్వరాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యపై గ్రామస్తులు పెద్దఎత్తున స్పందించగా, మహిళా సమాఖ్య నాయకులు తోకల అనురాధ, తోకల జయమ్మ, తోకల చిట్టి, యాదుల రత్నకుమారి, రాజమ్మ, దొడ్డ శ్యామల, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

పది మండల టాపర్‌కు ప్రోత్సాహకం

విశాలాంధ్ర-దుగ్గిరాల: పదవ తరగతి పరీక్షల్లో దుగ్గిరాల మండల టాపర్‌గా నిలిచిన గంప ఉమామహేశ్వరికి గివింగ్ బ్యాక్ టు సొసైటీ అండగా నిలిచింది. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందిస్తూ ప్రోత్సాహకంగా రూ.10 వేలు నగదు బహుమతిని అందజేసింది. శనివారం దుగ్గిరాల తహశీల్దార్ ఐ.సునీత చేతుల మీదుగా సదరు చెక్కును అందజేశారు. రేవేంద్రపాడు జడ్పీ హైస్కూలుకు చెందిన గంప ఉమామహేశ్వరి ఇటీవల విడుదల అయిన 10వ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 575 మార్కులు సాధించి మండలంలో ప్రథమంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మార్వో సునీత మాట్లాడుతూ పేద విద్యార్థులకు గివింగ్ బ్యాక్ టు సొసైటీ ప్రోత్సాహకం అందించటం అభినందనీయమన్నారు. ఉమామహేశ్వరి ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి మండల స్థాయిలో టాపర్‌గా నిలవడం అందరికి గర్వకారణం అన్నారు. విద్యార్థులు ఉమామహేశ్వరిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని విద్యార్థిని నిరూపించిందని అన్నారు. ఆమె ఉన్నత చదువులకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందని, ఆమె భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

బార్‌లో యువకుల ఘర్షణ.. ఒకరి మృతి

విశాలాంధ్ర-మంగళగిరి : మద్యం మత్తులో బార్ అండ్ రెస్టారెంట్‌లో యువకుల మధ్య జరిగిన ఘర్షణ ఓ యువకుడు నిండు ప్రాణం బలి తీసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. మంగళగిరి ఆటోనగర్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో శుక్రవారం రాత్రి చినకాకాని, పార్క్ రోడ్డుకు చెందిన పలువురు యువకులు మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో పార్క్ రోడ్డుకు చెందిన యువకుడి కాలును చినకాకానికి చెందిన యువకుడు తొక్కటంతో వివాదం రేగింది. చూసుకొని నడవాలని కాలు తొక్కటం ఏమిటి అంటూ సదరు యువకుడు ప్రశ్నించడంతో ప్రత్యర్థులు దాడికి దిగారు. బార్ షాపులోని ఓ వ్యక్తి కలగజేసుకుని అడ్డుకోగా సదరు వ్యక్తిపైన దాడి చేశారు. అద్దాలు పగుల గొట్టి బార్ ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో బార్‌లో పనిచేసే సిబ్బంది, చినకాకానికి చెందిన యువకుల మధ్య తీవ్ర ఘర్షణ, కొట్లాట చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో పుల్లగూర రవిచంద్ర అనే యువకుడు అద్దంపై బలంగా తన్నటంతో చేతికి గాయమైంది. చికిత్స నిమిత్తం ఎయిమ్స్ వైద్యశాలకు వెళ్లే సమయానికి తీవ్ర రక్తస్రావం కావడంతో రవిచంద్ర మృతి చెందాడు. పార్క్ రోడ్డుకు చెందిన ప్రసాద్ అనే యువకుడికి గాయాలయ్యాయి. మంగళగిరి పట్టణ సీఐ డి.వినోద్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఇదిలా ఉండగా పుల్లకూర రవిచంద్ర మృతికి బార్ సిబ్బంది కారణమని దౌర్జన్యంగా దాడికి పాల్పడ్డారని చినకాకానికి చెందిన యువకులు ఆరోపించారు. ఈ కేసులో అసలు వాస్తవాలు పూర్తి స్థాయిలో వెలుగులోకి రావాల్సి ఉంది.

అగ్నికి ఆహుతైన ప్రార్థనా మందిరం

విశాలాంధ్ర-మంగళగిరి : నగర పరిధిలోని అక్షయ పాత్ర సమీపంలో గల కృపా సమాజం ప్రార్థన మందిరంలో అగ్ని ప్రమాదం శనివారం చోటు చేసుకుందని నిర్వాహకులు తెలిపారు. వారి వివరాల ప్రకారం ఆదివారం జరుగు ఆరాధన ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ప్రార్థన మందిరం లోపల నుంచి పొగలు వస్తున్నాయని వాచ్‌మెన్ ఫోన్ చేసి చెప్పినట్లు తెలిపారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం తెలియజేయడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసే సమయానికి మందిరం అగ్నికి ఆహుతి అయిందని ఆయన చెప్పారు. మందిరం ఎదురుగా ఉన్న వాహనం కూడా పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. గుంటూరు 2వ అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం సంఘటనా స్థలానికి చేరుకునేసరికి సగంపైగా సిబ్బంది మంటలు అదుపు చేశారని మందిరం మొత్తం సెంట్రల్ ఏసీ కావడంతో అధిక వేడిని పొగను అదుపు చేశామని చెప్పారు. జరిగిన సంఘటన, ఆస్తి నష్టంపై పూర్తి సమాచారం అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రసాభసాగా మున్సిపల్ సమావేశం

విశాలాంధ్ర-తెనాలి : మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం రసాభసగా ముగిసింది. శనివారం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. అజెండా మధ్యలో మున్సిపాలిటీకి సంబంధంలేని అంశాలను రావడంతో టిడిపి కౌన్సిలర్లకు వైఎస్ఆర్‌సిపి కౌన్సిలర్లకు వాగ్వివాదాలు, తోపులాటలు జరిగాయి. దీనితో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సమావేశాన్ని ముగించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఆవుల కోటయ్య, తోట రఘురామ్, అత్తోట నాగవేణి, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, పసుపులేటి త్రిమూర్తి, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వియం లక్ష్మీపతిరావు, ఇన్‌చార్జి యంఇ ఆకుల శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆధునిక విద్యపై ఉపాధ్యాయులకు అవగాహనా తరగతులు

విశాలాంధ్ర-తెనాలి : ప్రస్తుత సమాజంలో వేగంగా మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా ఉపాధ్యా యులు తమ బోధనా పద్ధతులను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు అన్నారు. స్థానిక చెంచుపేటలోని నెహ్రూనికేతన్ లిటిల్ వండర్స్ పాఠశాలలో మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి దాసరి పర్యవేక్షణలో శనివారం ఆధునిక విద్యపై ఉపాధ్యాయులకు అవగాహనా తరగతులు ప్రారంభించారు. నూతన బోధనా పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, పాఠ్యాంశబోధనలో ట్యాబ్‌లు, కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ తరగతుల నిర్వహణ ఇత్యాది అంశాలపై పలువురు వక్తలు మాట్లాడారు. మెరుగైన పద్ధతుల్లో ఎలా విద్యాబోధన చేయాలి అనే విషయాలను సవివరంగా నిపుణులు తెలియజేశారు. ఇటువంటి అవగాహన తరగతుల వల్ల ఉపాధ్యాయులు తమ విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సన్నద్ధం చేయడానికి అవసరమైన నైపుణ్యాలను అందించగలుగుతామని మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ అన్నారు. ఈ తరగతులను లీడ్‌స్కూల్‌కు చెందిన అకాడెమిక్ అడ్వైజర్లు షేక్ అబ్దుల్ రజాక్, బి.వి. సుధాకర్ నిర్వహించారు.

రేపు సీపీఐ మండల మహాసభ

విశాలాంధ్ర-పెదకూరపాడు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టేందుకు సీపీఐ నిర్ణయించే ప్రజా ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు భైరపట్నం రామకృష్ణ పిలుపునిచ్చారు శనివారం మండల కేంద్రమైన క్రోసూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ శాఖ సమావేశాలు అనంతరం రెండోవ తేదీ సోమవారం. మండల కేంద్రంలో మధ్యాహ్నం రెండు గంటలకు సీపీఐ మండల మహాసభ జరుగ నున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మండల మహాసభకు పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, పెదకూరపాడు ఏరియా నాయకులు చెన్నకేశవరావు, బెల్లంకొండ మండల నాయకులు వెంకట్రావు, కరిముల్లా శ్రీనివాస రావు, క్రోసూరు మండల సిపిఐ నాయకులు పోతుగంటి నాగేశ్వరరావు, పసుపులేటి యాదగిరి, పెద కూరపాడు రైతు సంఘం నాయకులు కంచేటి పెద్దబ్బాయి, సామం తపూడి పాండు, ఆకుల శ్రీనివాసరావు, వెంకట్రావు, జమ్ముల బాజీ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు

మానసిక ప్రశాంతతకు యోగా

విశాలాంధ్ర-నరసరావుపేట: యోగాంధ్ర-2025లో భాగంగా నరసరావుపేటలో యోగా వీధిలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ లింగమూర్తి మాట్లాడుతూ జిల్లా ప్రజలు, యువత ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యోగా మానసిక ప్రశాంతతకు, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యోగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందని తెలిపారు.

యోగాంధ్ర పోటీలకు ఆహ్వానం

విశాలాంధ్ర-నరసరావుపేట: యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా గ్రామ/వార్డు, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి యోగా పోటీలు జరగనున్నాయని.. గ్రామస్థాయి విజేతలు మండల స్థాయికి, మండలస్థాయి విజేతలు జిల్లాస్థాయికి, జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయికి అర్హత సాధిస్తారని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసనాల ప్రదర్శన (సూర్య నమస్కార్ ఛాలెంజ్, ప్రాణాయామం, మెడిటేషన్), ఆర్టిస్టిక్ యోగా (యోగా సాంగ్, యోగా పెయింటింగ్, యోగా స్కిట్, రోల్‌ప్లే), వైజ్ఞానికి యోగా (యోగా క్విజ్, యోగా పోస్టర్, యోగా స్లోగన్, యోగా ఎస్సే), యోగా షార్ట్‌ఫిల్మ్, యోగా ఫొటోగ్రఫీలో పోటీలు జరుగుతా యని, గ్రూప్ విభాగంలో సింక్రనైజ్ గ్రూప్ యోగా, మిక్స్‌డ్ ఏజ్ గ్రూప్ యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూనియర్ గ్రూప్ (10-18 ఏళ్లు), యంగ్ గ్రూప్ (19-35 ఏళ్లు), సీనియర్ గ్రూప్ (35 ఏళ్లు, ఆపైన) కేటగిరీల్లో పోటీలు జరుగుతాయన్నారు. యోగా పోస్టర్, యోగా స్లోగన్, యోగా షార్ట్‌ఫిల్మ్, యోగా ఫొటోగ్రఫీ విభాగాల్లో పోటీపడాలనుకునే ఔత్సాహికులు తమ ఎంట్రీలను జూన్ 10వ తేదీలోగా 9440611107 (డా. ఆర్.శ్రీనివాస్) నంబరులో సంప్రదించవచ్చని సూచించారు. వివిధ పోటీల్లో విజేతలకు అవార్డుల ప్రదానం ఉంటుందని, ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దద్దరిల్లిన చిలకలూరిపేట కౌన్సిల్

- రూ.34 లక్షల అవినీతిలో నాటి మంత్రి, ఆమె మరిది పాత్ర
- తాను ఏ తప్పు చేయలేదని చైర్మన్ రఫాని వివరణ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: మున్సిపాలిటి పరిధిలో జరిగిన రూ. 34 లక్షల అవినీతి, మున్సిపల్ ఉద్యోగులపై చర్యలు, చైర్మన్ భావోద్వేగ ప్రసంగం కౌన్సిల్ సభ్యుల ఆరోపణల నడుమ శనివారం నిర్వహించిన మున్సిపల్ సమావేశం ఆద్యాంతం హాట్‌హాట్‌గా కొనసాగింది. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షతన పురపాలక సంఘ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటిలో జరిగిన అవినీతిలో నాటి మంత్రి విడదల రజిని, ఆమె మరిది ప్రమేయం ఉందని పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి ఆరోపణలు చేశారు. ఒక ఔట్సోర్సింగ్ ఉద్యోగి చేతివాటానికి 15మంది పర్మినెంట్ ఉద్యోగులు బలయ్యారని ఆరోపించారు. ఈ విషయంపై వైసీపీకి చెందిన వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ రోపణలు సరైనవి కాదని.... ఉద్యోగి గంగ భవాని చేసిన అవినీతికి మాజీ మంత్రి రజిని, గోపికి ఏంటి సంబంధం లేదన్నారు. ఈ విషయంపై కౌన్సిలర్ జాలాది సుబ్బారావు కలగ జేసుకుంటూ అవినీతి వెనుక వారి పాత్ర ఉన్నది వాస్తవమేనని తెలిపారు. ఈ విషయంపై సమావేశంలో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అవినీతి జరగలేదని నిరూపిస్తే రాజీనామాకు సిద్దమని కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి సవాలు విసిరారు. ఇదే విషయంపై వైసీపీ కౌన్సిలర్ కోట్యానాయక్ మాట్లాడుతూ ఈ అవినీతి చైర్మన్‌కు తెలిసే జరిగిందని, తీవ్ర ఆరోపణలకు దిగారు. మునిసిపల్ ప్రతిపక్ష నాయకులు గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికార పక్షానికి చెందిన వారు ఏది చెప్తే అదే చేశారు తప్పితే చైర్మన్‌కి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ విషయమై కమిషనర్ మాట్లాడుతూ 2021 మే నుండి 2023 జూన్ వరకు సుమారు 34 లక్షలు అవినీతి జరిగింది అని, జమ చేయవలసిన నిధులు గంగా భవాని చేత కట్టిస్తామని, త్వరలోనే అరెస్ట్ చేయిస్తామని తెలిపారు.

తండ్రి సన్నిధికి నీరు ఆపలేదు..

వేలాది మంది ప్రజలు హాజరయ్యే పట్టణంలోని దైవసన్నిధికి మున్సిపాలిటీ తాగునీటి నిలుపుదల చేయడం దారుణమని, గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని కాదని నీరు ఎందుకు నిలుపుదల చేశారని వైసీపీ కౌన్సిలర్ కోట్యా నాయక్ ప్రశ్నించారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు సమాధానం ఇస్తూ రెండు రోజుల పాటు సాంకేతిక సమస్య తలెత్తి నీటి పట్టణంలోని పండరీపురంలో సైతం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, రెండు రోజులు నీరు సరఫరా చేయలేమని చెప్పామని, దాన్ని రాజకీయం చేయడం శోచనీయమన్నారు. ఇప్పటికీ తండ్రి సన్నిధికి తాగునీరు అందజేస్తున్నామని తెలిపారు. ఈ విషయంపై కౌన్సిలర్ జలాది సుబ్బారావు కల్పించుకొని అసలు తండ్రికి సన్నిధికి మున్సిపాలిటీ నుంచి నీరు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. టీడీపీ కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గణపవరానికి సైతం ఆ రెండు రోజులు ట్యాంకర్లు పంపలేదని గుర్తు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విలీన గ్రామాలైన గణపవరం, మానుకొండ వారి పాలెం, పసుమర్రు గ్రామాలు పంచాయతీలో ఉన్నాయని అంటున్నారని, మూడు వార్డులకు మార్చి నెలలో జరిగిన బడ్జెట్ సమావేశంలో నిధులు ఎందుకు కేటాయించారని, విద్యుత్తు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు జరిగి ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ మూడు గ్రామాల అభివృద్ధి కి విడదలైన నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ పి.హరిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఈ వార్డుల సమస్య కోర్టు పరిధిలో ఉంది కాబట్టి, ఆ సమస్య తేలిన తర్వాత సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. టీడీపీకి మున్సిపల్ ప్రతిపక్ష నాయకులు గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గతం నుంచి తాము మాజీ ఇంటి నిర్మాణం కోసం కాల్వలను అతిక్రమించి నిర్మాణాలు చేశారని ఆరోపిస్తున్నా.. దీనిపై స్పందించటం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై పూర్తి సర్వే నిర్వహించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

డబ్బులు ఇస్తా.. నా పేరుతో ఆర్చ్ నిర్మించండి..

ఎజెండాలోని 20వ అంశంపై కో అపన్స్ సభ్యుడు మస్తాన్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. చిలకలూరిపేట ప్రజలకు ఎన్నో సేవలు అందించిన మైలవరపు గుండయ్య పేరుతో ఆర్చ్ నిర్మాణం చేస్తే తనకు అభ్యంతరం లేదని, కాని వారి బంధువులు పేరుతో ఆర్చ్ నిర్మాణాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు కోసం మున్సిపాలిటీకి చెందిన రూ. 6.50 లక్షలు వెచ్చించటం సరికాదని, తాను డబ్బులు ఇస్తాను తన పేరుపైన కూడా ఆర్చ్ నిర్మిస్తారా అని ప్రశ్నించారు. ఈ అంశాన్ని తదుపరి సమావేశంలో చర్చిద్దామని చైర్మన్ రఫాని వాయిదా వేశారు.

నేను ఏ తప్పు చేయలేదు..

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని బావోద్వంతో మాట్లాడారు. ఒక సందర్భంలో మీడియాపై కూడా తన అక్కసు వెళ్లగక్కారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తమని చైర్మన్‌గా కొనసాగమని చెప్పారని, అవినీతిలో తన పాత్ర లేదని, కావాలనే కొంతమంది దురుద్దేశంతో ఆపాదించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వెల్లడించారు. కావాలంటే ఖురాన్‌పై ప్రమాణం చేసి నిజం చెబుతున్నానని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో కనీసం మున్సిపల్ ఆస్తులు తనఖా పెట్టిన విషయం కూడా తనకు తెలియదని చెప్పారు. కౌన్సిల్ సభ్యులు సమావేశం ముగించాలని కోరటంతో పూర్తిగా మాట్లాడకుండానే సమావేశం ముగించారు.

పర్యాటకేంద్రంగా రామలింగేశ్వరస్వామి ఆలయం: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : రాష్ట్రంలో పల్నాడు జిల్లా, వినుకొండకే ప్రత్యేక గుర్తింపుగా ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని మహాపుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రంగా కూడా తీర్చి దిద్దుతామని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక ప్రజలతో పాటు అటు రాయల సీమ, ఇటు మిగిలిన రాష్ట్ర ప్రజలందరు దర్శించుకుని పూజలు చేసుకునే విధంగా సమప్టిక్ృష్టితో ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే తన సంకల్పమని చెప్పారు. వినుకొండ రామలింగేశ్వరస్వామి దేవాలయం, ఘాట్ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనం తరం ఈ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. వినుకొండ ప్రజల ఇలవేల్పు కొండ పైన వెలసిన రామలింగేశ్వరస్వామి అన్నారు. ఆ ఆలయ నిర్మాణాన్ని మళ్లీ పునఃప్రారంభించడం చాలా సంతోషకరమన్నారు. ఈ నిర్మాణ పనులను ప్రణాళికబద్ధంగా మాఘ మాసం నాటికి పూర్తి చేయాలనే ఆకాంక్షతో కమిటీ సభ్యులందరికీ బాధ్యతలు అప్పగిస్తున్నామన్నారు. ఘాట్ రోడ్డు పనులు 25శాతమే మాత్రమే పూర్తయ్యాయని, ఇంకా 75 శాతం పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశాక తారురోడ్డు, సైడ్ స్లోప్స్, రక్షణ గోడలు, కాల్వలు కూడా నిర్మిస్తామని తెలిపారు. భగవంతుడు, వినుకొండ ప్రజలు, చంద్రబాబు ఆశీస్సులతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించార న్నారు. రామలింగేశ్వరస్వామి కొండ ను అభివృద్ధి చేసేందుకు అడిగిన వెంటనే రూ.2 కోట్ల నిధులు ఇచ్చిన సీఎం చంద్రబాబుకు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. నాయకులు, అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా హీరో కృష్ణ జయంతి

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక అరుణ థియేటర్ వద్ద సూపర్ స్టార్ కృష్ణ 82వ జయంతి సందర్భంగా కృష్ణ, మహేష్ బాబు ఫాన్స్ వినుకొండ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మొదట కృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి అభిమానాన్ని చాటుకున్నారు. అభిమాని స్టీఫెన్ కి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి కృష్ణకి నిజమైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మానవ సేవా సమితి అధ్యక్షులు మరియు కృష్ణ అభిమాన సంఘం నాయకులు పివి సురేష్ బాబు మాట్లాడుతూ. వినుకొండ పట్టణంలో సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి స్థానిక శాసనసభ్యులు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విఫ్ జీవి ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు, చైర్మన్ దస్తగిరి మరియు కౌన్సిలర్లు సహాయ సహకారంతో విగ్రహాన్ని నిర్మిస్తామని చెప్పారు. ఫాన్స్ అసోసియేషన్ వినుకొండ వారు తీర్మానం చేశారు. కృష్ణ అభిమానులకు అండగా ఉంటామని ప్రజాహిత కార్యక్రమాలు సేవా కార్యక్రమాలు చేస్తామని మహేష్ బాబుకి అండగా ఉంటామని ఆపద సమయాలలో అండగా నిలుస్తామని ఈ సందర్భంగా పీవీ సురేష్ బాబు రవి చికెన్ బాబు వీరాంజనేయులు శివరామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం అండ్ ఎం రవి బాండ్, చికెన్ బాబు, పూర్ణ, చిట్టిబాబు, రత్నం, కృష్ణ, కిషోర్, లక్ష్మీనారాయణ, వీరాంజి, శివరామయ్య, రంగారెడ్డి, వందనం, వెంకటరావు, మౌలాలి, టి వెంకటేశ్వర్లు, చిన్న రహీం తుల్లా తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-దుర్గి: పశు సంవర్ధక శాఖ ద్వారా రాయితీలపై అందించే పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్ కోరారు. పశువైద్యశాల లో శనివారం పశువుల దాణా, పశుగ్రాసం విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దాణా బస్తాలు, పశుగ్రాసం విత్తనాలు పశుపోషకులకు పంపిణీ చేశారు. అనంతరం దుర్గి పశువైద్యులు డాక్టర్ డి.దిలీప్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కరువు, ఎండాకాలంలో పాల ఉత్పత్తి తగ్గకూడదనే ఉద్దేశ్యంతో పశువుల దాణా పంపించారని తెలిపారు. దానిలో భాగంగానే దుర్గి మండలానికి పశువుల దాణా 8 టన్నులు వచ్చాయని పేర్కొన్నారు. మొదటి దశలో రేషన్ కార్డు ఉన్న ప్రతిఒక్క రైతుకి కూడా ఇవ్వాలనే ఉద్దేశ్యం ఉందన్నారు. కానీ పూర్తి స్థాయిలో రాకపోవడంతో మొదటి విడతగా 5 గేదెలు పైబడిన రైతులకు మాత్రమే ఇప్పుడు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పూర్తి స్థాయిలో దాణా కట్టలు వచ్చిన తరువాత మిగతా వారికి కూడా అందజేస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు కటకం రాంమోహన్ రావు,వెలిదండి శ్రీనివాసరావు, సూరె బాల,రైతులు, పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ రాజధాని సాధ్యం కాదు

విశాలాంధ్ర-తాడికొండ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి రాజధానిలో ప్రపంచ రాజధానిని నిర్మించలేరని వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ షిరిడి సాయిబాబా కళ్యాణ మండపంలో శనివారం నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమీక్ష సమావేశం జరిగింది. జూన్ 4న జరిగే వెన్నుపోటు దినోత్సవాన్ని జయప్రదం చేయాలని నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసారని ధ్వజమెత్తారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే రూ.52 వేల కోట్లు అప్పులు తెచ్చారని తెలిపారు. అమరావతి నిర్మాణానికి, భూ సమీకరణకు వైసీపీ వ్యతిరేకం కాదని, ఉన్న భూమిని అభివృద్ధి చేయకుండా మరో పర్యాయం భూ సమీకరణకు వెళ్లటం ఏమిటని నిలదీశారు. రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యత ముఖ్యమని నొక్కిచెప్పారు. కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, ఏడు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, స్థానిక నాయకులు ముప్పాళ్ళ మనోహర్, వంగా పోలారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

36 వాహనాలపై కేసులు నమోదు

విశాలాంధ్ర-అమరావతి: వాహన తనిఖీల కారణంగా రోడ్లపై ప్రమాదాలు నివారించేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రవాణా పోలీస్ ఆర్టీసీ శాఖ వాహనాల తనిఖీలు నిర్వహించారు. శనివారం అమరావతి బస్టాండ్ కూడలిలో వాహనాలను తనిఖీలు నిర్వహించగా పరిమితికి మించి ప్రయాణం చేస్తున్న 80 వాహనాలను తనిఖీ చేసి, వీటిలో 36 వాహనాలపై కేసు నమోదు చేసినట్లు అమరావతి సీఐ వై అచ్చయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు వాహనాలను భద్రత నిమిత్తం అమరావతి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు.తెలిపారు. తనిఖీలపై అపరాధ రుసుము ద్వారా రూ. 80,600 లు వసూలు చేసినట్టు తెలిపారు కార్యక్రమంలో ఆర్టిసి డీఎం అమరావతి ఎస్.క కే అమీర్, రవాణా శాఖ అధికారి ఎం సురేష్ బాబు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ముందు రోజే లబ్ధిదారులకు పింఛన్లు: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి సంక్షేమం మూడు పువ్వులు, ఆరు కాయలుగా అమలవుతోందని ప్రభుత్వ చీఫ్‌విప్, జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రతి నెల 1వ తేదీనే 65 లక్షలమందికి ఉదయమే తలుపు తట్టి మరీ పింఛన్లు ఇస్తున్నారని, 1వ తేదీ సెలవు అయితే ముందు రోజే పింఛన్లు అందిస్తూ ఉండడం ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి మనసుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్లు ఎప్పుడు వస్తాయో తెలీని అయోమయం, అర్హుల పేర్లు కూడా తొలగించిన పరిస్థితులు ఉండేవన్నారు. వినుకొండ 26వ వార్డు కట్ట కింద బజారు ప్రాంతంలో ఆయన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ. ఇచ్చినమాట నిలబెట్టుకునే ఏకైక నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. వినుకొండలో ప్రతినెల 5,250 మందికి, రూ. 2కోట్ల 31 లక్షల 50వేలు పింఛన్లుగా అందిస్తున్నామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల తరపున రుణాల ద్వారా కూడా పేదల అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. విజన్-2047, అప్పటికి రాష్ట్ర తలసరి ఆదాయం రూ.55లక్షలకు చేర్చాలన్నది సీఎం చంద్ర బాబు లక్ష్యంగా చెప్పారు. ప్రధాని మోదీ కూడా రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు నిధులతో పాటు అనేకాంశాల్లో రాష్ట్రానికి సహాయ, సహకారాలు అందిస్తున్నారని అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేస్తున్నారని, సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నారని తెలిపారు. 20 లక్షల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. వినుకొండలో జాబ్ మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి నారా లోకేష్ ఇదే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున ఉద్యోగాల కల్పనకు శ్రమిస్తున్నా రన్నారు. జీడీసీసీబీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అవార్డులు, పురస్కారాలు ప్రజలు మెచ్చేవిగా ఉండాలి: మేడా శ్రీనివాస్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అవార్డులు, పురస్కారాలు ప్రజలు, సమాజం మెచ్చేవిగా ఉండాలే తప్పా..అవసరాల కోసం ప్రకటించేవిగా ఉండరాదని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొంత కాలంగా దక్కించుకుంటున్న సినీ పురస్కారాలు అర్హతను బట్టి కాకుండా తెర వెనుక నుంచి దక్కించుకున్నవేనని విమర్శించారు. నేటి ఆంధ్రప్రదేశ్ సినీ పరిశ్రమ నుంచి ప్రతిష్టాత్మ అవార్డులు, పురస్కారాలు దక్కించుకునే అర్హత గల తరం నేడు లేదనేది పచ్చి నిజమని, కొంతమంది దర్శకులు, రచయితలు, టెక్నీషియన్స్, సంగీత కళాకారులు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పటికీ వారిని గుర్తించే సమర్థత, స్థాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేకపోయిందని ధ్వజమెత్తారు. తెలుగు రాష్ట్రాలలో ఉన్న సెన్సార్ బోర్డులు, అవార్డుల కమిటీలు పోక చెక్కల వంటివిగా మిగిలాయని, వీరు ఇప్పటి వరకు ఎంపిక చేసిన అవార్డులు, పురస్కారాలు, సెన్సార్ బోర్డు నిబంధనల మేరకే విడుదల అయినవా ? ఆ సినిమాల మేరకైతే విచారణకు సిద్ధమా ? అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతానికి చెప్పుకోదగిన గొప్ప హీరోల ముందు వరుసలో ఘంటమనేని మహేష్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, అల్లు అర్జున్ ఆ తరువాత గోపీ చంద్, నాని ఆ వరుసలో మరికొంత మంది యువ హీరోలు, హీరోయిన్స్ తప్ప ఎవరు ఉన్నారని ప్రశ్నించారు.

4న వెన్నుపోటు దినం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: జూన్ నెల 4వ తేదీన రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అవినీతి మరియు అరాచక పాలనకు నిరసనగా వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని పార్టీ నేతలు కోరారు. శనివారం లింగంగుంట జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త పూనూరు గౌతమ్ రెడ్డి, మాజీ మంత్రి విడుదల రజిని, నరసరావుపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కాసు మహేష్ రెడ్డి , వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ,సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయ కర్త గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి వెన్నుపోటు దినోత్సవ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అరాచకాలకు అక్రమాలకు అవినీతికి నిరసనగా నిర్వహించనున్న ఈ "వెన్నుపోటు దినం" కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా వైఎస్సార్ పార్టీ శ్రేణులను మరియు ప్రజలను కోరారు.

ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి: కొండా



విశాలాంధ్ర-గుంటూరువైద్యం: శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ నిర్వహిస్తున్న ఉచిత ఆయుర్వేద శిబిరాలలో భాగంగా జూన్ 1వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వెనిగండ్ల గ్రామం బోసుబొమ్మ సెంటర్‌లో ఉన్న శ్రీ సీతారామాంజ నేయ దేవస్థానం నందు 'ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం' నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని వెనిగండ్ల గ్రామ ప్రజలు ఆ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్యం నిపుణులు డాక్టర్ కొండా వేంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాడీ పరీక్ష, కీళ్ళ నొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటికా, పక్షవాతం, మోకాళ్ళ అరుగుదల, ఆస్తమా, ఎలర్జీలు, అధిక బరువు, చర్మ వ్యాధులు, సోరియాసిస్, ఫైల్స్, హెచ్ఐవీ అండ్ ఎయిడ్స్, వెన్నుపూస తదితర వ్యాధులకు సంబంధించి, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఉచితంగా మందులు ఈ శిబిరం నందు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మానసిక, శారీరక ఉల్లాసానికి యోగా

విశాలాంధ్ర-పొన్నూరు : మానసిక, శారీరక రుగ్మతలను పారద్రోలి మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు యోగాసనాలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. యోగాంధ్రలో భాగంగా శనివారం లయన్స్ క్లబ్‌లో యోగాంధ్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ప్రజలు పాల్గొని మాస్టర్లు సూచించిన విధంగా యోగాసనాలు చేశారు. కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, Logisetty Jayachand, S/o. Logisetti Jagan Mohan Rao, R/o. Flat No. 211, Maruthi Enclave Tadepalli-522 501, A.P. That my father's name was wrongly mentioned as **Mohan Rao** (Old Name) in my 10th Certificate. His correct name is **LOGISETTI JAGAN MOHAN RAO** (New Name) and is known & called as **LOGISETTI JAGAN MOHAN RAO.**

పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కన్నా

విశాలాంధ్ర-సత్తెనపల్లి: ఇంటి ఇంటికి వెళ్లి పెన్షన్లు సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ శనివారం పంపిణీ చేశారు. సత్తెనపల్లి నియోజకవర్గం లో ఉదయాన్నే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేసామని కన్నా తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు ఉదయం నుంచి సత్తెనపల్లి 29వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇంటి ఇంటికి వెళ్లి పంపిణీ చేసిన నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాశ్ నారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మణిపాల్‌లో ఉచిత ఓపీడీ సేవలు

విశాలాంధ్ర-తాడేపల్లి : మణిపాల్ హాస్పిటల్స్‌లో కన్సల్టెంట్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ నందన్ వేమూరి జూన్ 2 నుంచి జూన్ 15 వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత ఓపీడీ కన్సల్టేషన్ సేవలు అందించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం వాస్కులర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి నిపుణుల ద్వారా వైద్య సలహా అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. కన్సల్టేషన్ ఉచితంగా లభించనున్నా, రిజిస్ట్రేషన్ ఛార్జీలు వర్తిస్తాయి. రద్దీ నివారించేందుకు ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకోవడం తప్పనిసరి తెలిపారు. చికిత్సల పరిధిలో ఉన్న రోగ లక్షణాలు: వెరికోస్ వెయిన్స్?, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అపాయింట్‌మెంట్ కోసం మణిపాల్ హాస్పిటల్స్ 9392911288లో సంప్రదించవచ్చని తెలిపారు.

కోర్టు నోటీసు

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 340 / 2024 in O.S. No. 284 / 2014
బిట్వీన్ :
సల్లా శ్రీనివాసరావు ...పిటిషనర్/వాది
మరియు
సాదినేని గోవిందమ్మ మరియు 6గురు
....రెస్పాండెంట్స్ / ప్రతివాదులు.

1) సాదినేని శివ శంకర్, తండ్రి. గోవిందు, సాకిన్ దైద గ్రామము గురజాల మండలం, పల్నాడు జిల్లా. 2)సాదినేని వెంకటేష్, తండ్రి. గోవిందు, సాకిన్ దైద గ్రామము, గురజాల(మం),పల్నాడు జిల్లా, పై నెంబర్ దావాలో మిమ్ములను 5 & 6 ప్రతివాదులుగా చేర్చమని కోరుచూ పై నెంబర్ గల ఐ.ఎ.నెం.340/2024 పిటీషన్‌ను దాఖలుచేసి యున్నాడు. సదరు ఐ.ఏ.నెం340/2024 పిటీషన్ లో పైకోర్టు వారి ద్వారా మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను ఉద్దేశపూర్వకంగా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారు ఇందు విషయమై ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసులు జారీ చేయమని ఉత్తర్వులుఇస్తూ పై ఐ.ఏ నెం.340/2024 పిటిషన్‌ను **ది.30-06-2025**కి శ్రీ కోర్టువారు వాయిదావేసిఉన్నారు. కావున **ది. 30-06-2025**వ తేదీన ఉ॥గం॥**10:30**ని॥లకు మీరు స్వయంగా గాని లేదా వకీల్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియు జేయగలరు. అల హాజరు కాని యెడల పై పిటిషన్ ను మీపరోక్షంగా తీర్మానంచేయగలరు.
వాయిదా తేది:30-06-2025

కనకం ఆది నారాయణ, అడ్వకేట్.
గురజాల పల్నాడు జిల్లా, ఎ.పి. సెల్: 9885135746

KALLAM TEXTILES LIMITED
CIN-L18100AP1992PLC013860
NH-5, Chowdavaram, GUNTUR - 522 019.
Ph: 0863 - 2344010, 16 Fax: 0863-2344000,
E-mail Ids: corp@kallamtextiles.in, accsp@kallamtextiles.in
GSTIN: 37AAACK9363M1ZY

EXTRACT OF UNAUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER AND YEAR ENDED 31st MARCH, 2025

PARTICULARS	Quarter Ended			Year Ended	
	31.03.2025 (Audited)	31.12.2024 (Unaudited)	31.03.2024 (Audited)	31.03.2025 (Audited)	31.03.2024 (Audited)
Total income from operations (net)	6487.49	6337.72	6194.17	25670.85	36738.19
Net Profit/(Loss) for the period (Before tax, exceptional and extraordinary items)	(1345.08)	(1727.97)	(1620.40)	(6425.07)	(5611.61)
Net Profit/(Loss) for the period (Before tax after exceptional and extraordinary items)	(1340.30)	(2490.34)	(1620.40)	(7182.66)	(5611.61)
Net Profit/(Loss) for the period (After tax and after exceptional and extraordinary items)	(883.34)	(1622.29)	(1097.85)	(4736.96)	3744.79)
Total Comprehensive income/(Loss) for the period (includes profit after tax and other comprehensive income net of tax)	(848.82)	(1623.43)	(1065.43)	(4678.91)	(3675.36)
Equity Share Capital	1056.21	1056.21	1056.21	1056.21	1056.21
Reserves (excluding Revaluation Reserve as shown in the Balance Sheet of previous year)				(747.07)	3939.93
Earnings Per Share (EPS) (of 2/- each)					
a) Basic & Diluted EPS before extraordinary items	(1.67)	(3.07)	(2.08)	(8.97)	(7.09)
b) Basic & Diluted EPS after extraordinary items	(1.67)	(3.07)	(2.08)	(8.97)	(7.09)

Note: The above mentioned results are an extract of the detailed format of audited Financial Results for the Quarter and Year ended 31st March, 2025 filed with the Stock Exchanges under Regulation 33 of the SEBI (Listing and Other Disclosure Requirements) Regulations, 2015. The full format of audited Financial Results for Quarter and Year ended 31st March, 2025 are available on the Stock Exchange website. (www.bseindia.com) and the Company's Website (www.ksml.in)

Place: Chowdavaram
Date : 30-05-2025

For Kallam Textiles Limited
Sd/- P. Venkateswara Reddy
(Managing Director)
DIN : 00018677

గ్రామ శాఖ కార్యదర్శిగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర- పెదకూరపాడు: కార్మిక కర్షక వ్యవసాయ కూలీ హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసే భారత కమ్యూని స్టు పార్టీ ఆశయాలను ముందుకు నడిపించేం దుకు ప్రతి కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పల్నాడు జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు బైరా పట్నం రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం రామాంజనేయపురంలో ఏర్పాటు చేసిన సీపీఐ గ్రామ శాఖ మహాసభలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా సిరియాల శ్రీనివాసరావు సహాయ కార్యదర్శిగా ఎలిమిలేటి రవిలను ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకోవడం జరిగింది. వీరితో పాటు కమిటీ సభ్యులుగా మాచవరపు ఆహారోన్, కన్నా రాధాకృష్ణ, కె వార్డ్ బాబు, ఎం అంకయ్య, మేకల చిన్న వెంకటయ్య, మార్కండేయులతో నూతన కమిటీ ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పి వెంకట్రావు ఎస్కే కరిముల్లా, పి నాగేశ్వరరావు, కారంపూడి చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు

దేవస్థాన ఈఓగా కోగంటి బాధ్యతలు

విశాలాంధ్ర-మంగళగిరి : శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానానికి నూతన ఈఓగా కోగంటి సునీల్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కంఠంరాజు కొండూరులోని మహంకాళి అమ్మవారి ఆలయ ఈఓగా పనిచేశారు. బదిలీపై మంగళగిరి వచ్చారు. ఇక్కడ ఈఓగా పనిచేసిన ఏ.రామకోటిరెడ్డి పదవీ విరమణ చేశారు. ఈ మేరకు సునీల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

పొగాకు తాగొద్దు.. క్యాన్సర్‌కు గురికావొద్దు: డీఎంహెచ్ఓ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఓ)డాక్టర్ కొర్ర విజయలక్ష్మీ అధ్యక్షతన సిబార్ డెంటల్ కాలేజీ విద్యార్థులు, ఆశా కార్యకర్తలతో ర్యాలీ చేపట్టారు. జెండా ఊపి ర్యాలీని డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పొగాకు వ్యతిరేక దినంపై ప్రతిజ్ఞ చేయించారు. డిఎంహెచ్ఓ కార్యాలయం నుండి ప్రారంభమై నగరంపాలెం మూడు బొమ్మలు సెంటర్ వరకు వెళ్ళి అక్కడి నుంచి తిరిగి డిఎంహెచ్ఓ కార్యాలయంకు చేరింది. పొగాకు తాగొద్దు..క్యాన్సర్ వ్యాధికి గురికావొద్దు..సిగరెట్ పొగ జీవితానికి సెగ..పొగాకు ఏ రూపంలో తీసుకున్నా ప్రమాదమే అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ ర్యాలీని కొనసాగించారు. అనంతరం డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ పొగాకును ఏ రూపంలో తీసుకున్న ప్రమాదకర జబ్బులు వస్తాయని, ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధికి పొగాకు వాడటం ఒక కారణమని తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ బీఎస్ఎస్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ ఈ.అన్నపూర్ణ, సిబార్ దంత వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ లలిత్, ఎన్‌సీడీ కన్సల్టెంట్ గిరిధర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించటం ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కేవీఎల్ రావు చెప్పారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా రవాణా, పోలీసుశాఖల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 70 వాహనాలు పరిశీలించి 12 వాహనాలపై కేసులు నమోదు చేశారు. వాటిపై రూ. 63,930 అపరాధ రుసుం విధించారు.

అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు: భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం దేశ స్వాతంత్ర ఉద్యమంలో ఆలు పెరుగని పోరుబాట వేసిన ఎర్ర జెండా ముద్దుబిడ్డలైన కమ్యూనిస్టుల ఆశయాలను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు ప్రతి సీపీఐ కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బైరా పట్నం రామకృష్ణ పిలుపునిచ్చారు. బెల్లంకొండ మండల పరిధిలోని రామాంజనేయపురం సీపీఐ శాఖ మహాసభలో పాల్గొని ప్రసంగించారు. మహాసభకు పొన్నూరి వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అలుపెరుగని పోరాటం చేసిన కమ్యూనిస్టులు ఎందరికో భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ చేసిన కమ్యూనిస్టు నాయకుల ఆలోచన విధానం వైపు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించే ఎర్రజెండా నీడన ప్రజా హక్కులు కాపాడేందుకు ప్రజా పోరాటాలకు అంకితభావంగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఏరియా సీపీఐ నాయకులు కారంపూడి చెన్నకేశవ పోతుగంటి నాగేశ్వరరావు, పొన్నూరి వెంకట్రావు, షేక్ కరీముల్లా తదితరులు పాల్గొని ప్రసంగించారు

ఇళ్ల స్థలాల కోసం ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తుళ్లూరు : పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న తుళ్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా సమితి, సీపీఐ ప్రకటించాయి. ఈ మేరకు బోరుపాలెం గ్రామంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇస్తామని వాగ్దానం చేసినప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదని తెలిపారు. నిర్మాణానికి మంజూరు చేస్తామన్న రూ.4 లక్షలను రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. స్థలాల్లేని పేదలు ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం పిలుపునిచ్చింది. కార్యక్రమంలో సంఘ నాయకులు ఖమ్మంపాటి దేవుని దయ, తోకల అనురాధ, జయమ్మ, సుజ్జమ్మాయి, పాములమ్మ, అచ్చమ్మ, మేరెమ్మ, మేరీ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వా లని కోరుతూ జూన్ 2వ తేదిన రెవిన్యూ కార్యా లయాల వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హను మంతరావు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, సూపర్ సిక్స్ హామీలు అమలుపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు తన్నీరు ప్రభుదాస్, జిల్లా ఏపీ కౌలు రైతు సంఘం కార్యదర్శి పీవీ జగన్నాథం, ప్రతిపాడు నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు, సహాయ కార్య దర్శి సోమేపల్లి వీరాంజనేయులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీల్లో అసంబద్ధాలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: టీచర్ల బదిలీలలో సీనియార్టీ లిస్టులో గల అసంబద్ధాలపై చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా డీఈఓ సివి రేణుకను ఎస్టీయూ నాయకులు కోరినట్లు ఎస్టీయూ డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఎస్టియు గుంటూరు జిల్లా అధ్యక్షులు పెదబాబు గుంటూరు జిల్లా డీఈఓను కలిసి టీచర్ల బదిలీలలో సీనియార్టీ లిస్టులో గల అసంబద్ధాలపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, చిలకలూరిపేట మున్సిపాలిటీ పరిధిలో గల ఉపాధ్యాయుల ట్రాన్స్ఫర్స్ అప్లికేషన్స్‌లో సీనియారిటీ కొరకై ఒకే రకమైన ఇంటిటిల్మెంట్ పాయింట్స్ వచ్చినప్పుడు. వారి డేటాఫ్ బర్త్ ఆధారంగా సీనియారిటీని నిర్ణయించారని వెల్లడించారు. కానీ ఒకే రకమైన ఇంటిటిల్మెంట్ పాయింట్స్ వచ్చినప్పుడు... డీఎస్సీ మెరిట్ ఆధారంగా వారి యొక్క సీనియార్టీ నీ నిర్ణయించవలసిందిగా డీఈవోను కోరారు. వాటిని పరిశీలించి తగు న్యాయం చేస్తామని డీఈవో హామీ ఇచ్చినట్లు తెలిపారు. మహిళా ఉపాధ్యాయినిల ట్రాన్స్ఫర్స్ విషయంలో స్పెషల్ పాయింట్స్ పొందడం కొరకు వారు సమర్పించ వలసిన లేగల్లి సెపరేటెడ్ సర్టిఫికెట్ విషయం లో వివరణ కోరగా జిల్లా విద్యాశాఖ అధికారి వివరణ ఇస్తూ కోర్టు ద్వారా సమర్పించినటువంటి లీగల్లీ డైవర్సిడ్ సర్టిఫికెట్ ద్వారా మాత్రమే వారికి స్పెషల్ పాయింట్ల కేటాఇస్తామని, ముస్లిం మహిళ ఉపాధ్యాయినిలు. కోర్టు ద్వారా తెచ్చినటువంటి లీగల్లీ డివోర్స్ సర్టిఫికెట్ కాకుండా.. ముస్లిం మత పెద్దలు ఇచ్చినటువంటి సర్టిఫికెట్ పరిగణనలోనికి తీసుకోనరని తెలిపారు. ఉపాధ్యాయులు పై రెండు సమస్యల పట్ల ఆందోళన చెందాల్సిన పనిలేదని పోటు శ్రీనివాసరావు పత్రికా ప్రకటన తెలియజేశారు.

రోడ్లపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు



విశాలాంధ్ర-పొన్నూరు: పురపాలక సంఘం పరిధిలోని ప్రధాన రహదారు లు జిబిసి రోడ్డు, చందోలు రహదారు ల వెంబడి పట్టణంలోని వ్యాపారులు, గృహవాసులు చెత్త వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు హెచ్చరించారు. శనివారం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రోడ్ల వెంబడి చెత్త వ్యర్థాలు వేయటం వలన దుర్గంధం వెదజల్లడంతో పాటు రహదారులు అపరిశుభ్రంగా మారతాయని తెలిపారు. రహదారులలో ప్రయాణించే వారికి తీవ్ర ఆటంకంగా ఉంటుందని పేర్కొన్నారు. గృహవాసులు, వ్యాపారస్తులు తవ వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు అందించాలని ఆయన సూచించారు. రోడ్ల వెంబడి వ్యర్థాలు వేసినట్లు గుర్తిస్తే మున్సిపల్ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొన్నూరు పురపాలక సంఘం పరిశుభ్రతకు పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పేదలకు పెన్షన్లు ఆర్థిక భరోసా

విశాలాంధ్ర - పిడుగురాళ్ల : కూటమి ప్రభుత్వంలో పేదల పింఛన్లు, ఉద్యోగుల జీతాలు 1వ తేదీనే అందివ్వడం.. సైకో ప్రభుత్వానికి - సంక్షేమ ప్రభుత్వానికి వున్న తేడాగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గుర్తు చేశారు. పట్టణ తెదేపా కార్యాలయంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా 26వ వార్డు పరిధిలో లబ్ధిదారులకు పింఛన్లను ఎమ్మెల్యే యరపతినేని అందజేశారు. వృద్ధులు వికలాంగులు తోపాటు మంచానికే పరిమితమై అచేతన స్థితిలో ఉన్న అభాగ్యులకు పెరిగిన పింఛన్లు ఎంతో ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని యరపతినేని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని తుమ్మలచెరువు చెట్టు (అంజనాపురం) వద్ద ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తో పాటు టీడీపీ సభ్యులు జంగా కృష్ణమూర్తి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. తహసిల్దార్ పి.మధుబాబు, పిడుగురాళ్ల పురపాలక కమిషనర్ పర్వతనేని శ్రీధర్, తెదేపా మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు గండికోట వెంకటేశ్వర్లు, పాండురంగ శ్రీనివాసరావు తో పాటు జనసేన మండలాధ్యక్షులు కామిశెట్టి రమేష్ కూటమి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు

న్యాయవాదులు విధుల బహిష్కరణ

విశాలాంధ్ర-పొన్నూరు: తెనాలి పట్టణంలో ఒక న్యాయవాదితో పాటు దళిత, ముస్లిం యువకులపై పోలీసులు దాష్టికంగా హింసించినందుకు నిరసనగా పొన్నూరు పట్టణంలోని బార్ అసోసియేషన్ న్యాయవాదులు నిరసన చేపట్టి విధులకు బహిష్కరించారు. పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరించటంపై వారు ఖండించారు. యువకులను చట్ట పరిధిలో శిక్షించాలి కానీ ఇలా క్రూరత్వంగా హింసించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ సాహెబ్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు విరమణ సన్మానం

విశాలాంధ్ర-దుర్గి: అడిగొప్పల పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోగా 33 సంవత్సరాలు పనిచేసిన ఆర్ఎండి హాఫీజుద్దీన్ తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న టి.నిర్మల శనివారం ఉద్యోగ విరమణ చేశారు. సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరం,తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎంపిపి,తహశీల్దార్,ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శాలువాలు,పూలమాలలతో శనివారం సత్కరించారు. అనంతరం ఎంపిపి యేచూరి సునీత సాయి శంకర్,తహశీల్దార్ ఫణీంద్ర కుమార్, ఎంపీడీఓ శివప్రసాద్ మాట్లాడుతూ వారు ఇరువురు విధుల పట్ల అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందారని అన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సత్యప్రసాద్,లింగా రమేష్, విఆర్వో లు,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తులు

విశాలాంధ్ర-సత్తెనపల్లి: పట్టణంలోని సబ్ జైలును సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సత్తెనపల్లి వి.విజయ్ కుమార్ రెడ్డి సందర్శించారు. ముందుగా సబ్ జైలులో పరిసరాలను పరిశీలించి, అనంతరం అక్కడ ఉన్న రిజిస్టర్ ను పరిశీలించారు. అక్కడ ఉన్న రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న ఆహార పదార్థాలను మరియు వాటి నాణ్యతను పరిశీలించారు.

మలబార్ గోల్డ్ డైమండ్స్ ఎక్స్ క్లూజివ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : మలబార్ గోల్డ్ డైమండ్ ఎక్స్ క్లూజివ్ ఆభరణాల ప్రదర్శనను మలబార్ వినియోగ దారులు ప్రారంభించారు. ఈ అద్వితీయమైన బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శనని ముఖ్య అతిథులు. ఉన్నత అధికారులు మరియు శ్రేయోభిలాషుల సమక్షంలో ప్రారంభించారు. మలబార్ గోల్డ్ డైమండ్స్ టీం మెంబర్స్ అద్వితీయమైన బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణలుగా మలబార్ గోల్డ్ కి డైమండ్స్ వారి బ్రాండుల సమాహారం "మైన్" ధ్రువీకరించబడిన వజ్రాభరణాలు, వివాహ మరియు పార్టీ సంబరాల కోసం 'ఎరా' అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి 'ఫ్రెష్' జాతిరత్నాభరణాల సముదాయం సమకూర్చారన్నారు. ఈ ప్రదర్శన విజయవాడలో 31 మే నుండి 08 జూన్ వరకు 2025 నిర్వహించబడుతుందన్నారు. ఈ సందర్భంగా వినియోగదారులు మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడ కొనుగోలు చేస్తున్నమని అన్నారు. ఈ సందర్భంగా షోరూం మార్కెటింగ్ మేనేజర్ ఖాసి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని అందరు వినియోగించు కోవాలని కోరారు. గ్లోబల్ పవర్స్ ఆఫ్ లగ్జరీ గూడ్స్ 2023 ర్యాంకింగ్ లో 19వ స్థానం కైవసంచేసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.యామిని, డాక్టర్ జి.మృదుల, ఆర్ లిఖిత, కళా వర్మ, వి.గాయత్రి షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

మొవ్వ హైస్కూల్ హెచ్ఎంగా ఉమాశ్రీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ పిఎం శ్రీ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా నిమ్మగడ్డ ఉమశ్రీ పదోన్నతి పై బదిలీ అయినారు. గురువారం రాత్రి జరిగిన బదిలీల ప్రక్రియలో పెనమలూరు జిల్లా పరిషత్ హై స్కూల్ లో స్కూల్ అసిస్టెంట్ (లెక్కల ఉపాధ్యాయు రాలు)గా పనిచేస్తున్న ఉమశ్రీని పదోన్నతిపైబదిలీ చేస్తూ కృష్ణా జిల్లా డీ.ఈ.వో. జె.వి రామారావు ఉత్తర్వులు అందజేశారు. పెడసనగల్లు హైస్కూల్ హెచ్ఎం కాకర్ల శిరీష విజయవాడ సమీపం లోని యనమలకుదురుజిల్లా పరిషత్ హై స్కూల్ కి బదిలీ కాగా ఆమెస్థానంలోపెడన మండలం నుంచి వడ్డీ సంజీవరావు విచ్చేశారు. కాగా కూచిపూడి జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ హెచ్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్ (సంస్కృత ఉపాధ్యాయులు గుంటూరు వెంకట సత్య ప్రసాద్ పదోన్నతి పై ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం బొమ్మినంపాడుజిల్లా పరిషత్ హై స్కూల్ కి బదిలీ అయ్యారు. వీరందరూ ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలల నుంచి శనివారం నాదురిలీవైనారు.

క్షేత్రయ్య ఆరాధన మందిరం ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో65 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన శ్రీ క్షేత్రయ్య ఆరాధన మందిరం ను పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శనివారం ప్రారంభించారు. శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో సర్వ శ్రేయోనిధులు35లక్షలుతో పాటు దాతలు అందించిన 30 లక్షలు వెరసి 65 లక్షల రూపాయలతో నిర్మించిన ఈ మందిర ప్రారంభోత్సవ వేడుకలలో ఆయనతోపాటు జడ్.పి.టి.సి. రాజులపాటి పార్వతి, దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, మొవ్వ ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య,మండల తెలుగుదేశం అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వర రావు, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈవో డి సుబ్బారెడ్డి (మచిలీపట్నం), శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం ఈవో ఎస్ వి సుబ్బారావు (మొవ్వ), స్థానిక నాయకులు తాతినేని పూర్ణచంద్రరావు, మండవశ్రీకృష్ణ, శీలం బాబురావు మండవ(బుజ్జి) కోటేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, దేవాలయ అర్చకులు మొవ్వ రవి తదితరులు పాల్గొన్నారు.

గణనాథునికి ద్వితీయ వార్షికోత్సవ అభిషేకాలు

విశాలాంధ్ర-కూచిపూడి : "ఓబొజ్జగణపయ్య... నీ బంటు నేనయ్య" అంటూ చిన్నారులైన విద్యార్థులు కూచిపూడి లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ద్వితీయ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా శనివారం పంచామృతాలతో అభిషేకం చేసి అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూచిపూడి అగ్రహారంలో గంటలమ్మ (రావి చెట్టు) నీడలో సత్యసాయి బాబా మందిరం వద్ద రెండు సంవత్సరాలు క్రితం ప్రతిష్టించిన వినాయకునివిగ్రహానికి ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నిరాఘాటంశివరామచంద్ర కార్తికేయ శర్మ (8వ తరగతి), పసుమర్తి సుబ్రహ్మణ్య శర్మ (10వతరగతి)లు శాస్త్రయుక్తంగా పూజలు నిర్వహించగా సోమయాజుల అనంతరామ శర్మ (ఇంటర్మీడియట్) సహకరించారు. అనంతరం ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

రెస్టారెంట్ ప్రారంభం

విశాలాంధ్ర-ఉయ్యూరు : స్థానిక కాటూరు రోడ్లో నూతనంగా ఏర్పాటు చేసిన రెస్టారెంట్ ను దివంగత తెలుగుదేశం రాజ్యసభ సభ్యులు నందమూరి హరికృష్ణ కుమార్తె నందమూరి సుహాసిని శనివారం ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ ఛాంబర్ అధ్య క్షులు వై వి రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్యే వర్లరాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బకార్డి లెగసీకి వరల్డ్ విస్కీస్ గోల్డ్ అవార్డ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): బకార్డి యొక్క మొట్టమొదటి మేడ్-ఇన్-ఇండియా ప్రీమియం విస్కీ అయిన లెగసి, ప్రతిష్టాత్మక వరల్డ్ విస్కీస్ అవార్డ్స్ 2025లో బ్లెండెడ్ విస్కీ విభాగంలో గోల్డ్‌ని అందుకుంది. ఈ గుర్తింపుతో, ప్రపంచ గుర్తింపును పొందిన భారతదేశం యొక్క సరికొత్త ప్రీమియం వ్యక్తీకరణగా లెగసి మారింది. సొగసైన, సమకాలీనమైన, నైపుణ్యంతో రూపొందించబడిన లెగసి కేవలం ఒక కొత్త విస్కీ కాదు.. ఇది ఆధునిక భారతీయ అధునాతనత, ప్రపంచ ఆకాంక్షను ప్రతిబింబించే జీవనశైలి ప్రకటనగా నిలిచింది. భారతదేశంలో రాజీలేని నాణ్యతతో రూపొందించబడిన లెగసి, భారతీయ, స్కాటిష్ మాల్ట్‌ల యొక్క విలక్షణమైన మిశ్రమం. ఈ అవార్డులు లెగసిని ప్రపంచ పటంలో ఉంచడమే కాకుండా, ప్రీమియం విస్కీ తయారీ ప్రపంచంలో బకార్డి యొక్క ప్రభావాన్ని కూడా నొక్కి చెబుతున్నాయి.

10 వేలకు పైగా బ్రాండ్లతో మింత్రా ఈవోఆర్ఎస్ 22వ ఎడిషన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రముఖ ఫ్యాషన్, సౌందర్యం, జీవనశైలి ఉత్పత్తులకు గమ్యస్థానాలలో ఒకటైన మింత్రా, జూన్ 12 వరకు తన ఫ్లాగ్‌షిప్ ఎండ్ ఆఫ్ రీజన్ సేల్ (ఈవోఆర్ఎస్) 22వ ఎడిషన్‌ను కొనసాగిస్తోంది. ఫ్యాషన్ ప్రియులు అందరూ ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్న ఈ షాపింగ్ ఈవెంట్ దేశవ్యాప్తంగా ఫ్యాషన్, సౌందర్య ప్రియులను ఆకట్టుకుంటోంది. మెట్రో, భారీ నగరాల నుంచి (టైర్ 1, టైర్ 2), అభివృద్ధి చెందుతున్న నగరాలకు చెందిన కొనుగోలుదారులు అంతర్జాతీయ, దేశీయ, స్వదేశీ బ్రాండ్‌లతో సహా 10 వేల కన్నా ఎక్కువ బ్రాండ్‌ల నుంచి నాలుగు మిలియన్లకు పైగా స్టైల్లలో విస్తృత ఎంపికను అన్వేషించుకునేందుకు మింత్రా అవకాశం కల్పిస్తోంది. ప్రతి ఒక్కరి అభిరుచి, ట్రెండ్‌కు అనుగుణంగా ఈ సీజన్‌లో వారికి కావలసిన అత్యంత స్టైలిష్ ఎంపికలతో, వారి వార్డ్‌రోబ్‌లు, బ్యూటీ షెల్ఫ్‌లను భర్తీ చేసుకోవాలని కోరుకుంటున్న వారికి వారికి ఇది చివరి గమ్యస్థానంగా నిలుస్తోంది.

ఏపీ, తెలంగాణలో సీఎస్ఆర్ కింద పలు ప్రాజెక్టులు చేపట్టిన వి-గార్డ్ ఇండస్ట్రీస్

విశాలాంధ్ర-విజయవాడ: ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఉపకరణాల రంగంలో అగ్రగామిగా ఉన్న వి-గార్డ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1.23 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులు చేపట్టింది. విజయవాడలోని ప్రభుత్వ దంతవైద్య కళాశాల ఆస్పత్రి లో గల ప్రోస్థోడాంటిక్స్ విభాగానికి ప్రత్యేకమైన పరికరాలు అందించడంతో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాస్పత్రుల సపోర్ట్ ప్రాజెక్టును వి-గార్డ్ చేపట్టింది. తద్వారా.. అన్ని ప్రాంతాల్లోనూ అందరికీ వైద్యసేవలు అందాలన్న తన నిబద్ధతను మరింత బలోపేతం చేసిందని ఈ కార్యక్రమాల గురించి డాక్టర్ రీనా మిథున్ చిట్టిలప్పిలి చెప్పారు. విద్య, వైద్యం తదితర రంగాలపై ప్రధానంగా దృష్టిపెట్టి రెండు రాష్ట్రాల్లో కొన్నివేల మంది జీవితాలు బాగుచేయడమే లక్ష్యంగా కంపెనీ ఈ కార్యక్రమాలు చేపట్టింది. తెలంగాణలో ఈ కంపెనీ చేపట్టిన ప్రధాన కార్యక్రమాల్లో నవదర్శన్ ఒకటి. మేధోపరమైన సమస్యలున్న పిల్లలకు సాధికారత కల్పించేందుకు దీన్ని ఉద్దేశించారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలోని 10 స్పెషల్ స్కూళ్లలో ఉన్న 958 మంది పిల్లలకు విద్య, వృత్తి శిక్షణ, చికిత్స తదితరులకు వి-గార్డ్ సాయం చేసింది. దీంతోపాటు ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించింది. తద్వారా పిల్లలు ఎదిగి, నిలబడి, తమ శక్తి సామర్థ్యాలేంటో తెలుసుకుం టారు. ఇలాంటి పిల్లలు కూడా స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో తమ జీవితాల్లో ముందుకెళ్లాలన్న ఉద్దేశంతో ఒక పునాదిగా నవదర్శన్ కార్యక్రమం ఉపయోగ పడుతుంది. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలల కోసం ఒక ప్రత్యేక కార్యక్రమం కూడా వి-గార్డ్ ఆధ్వర్యంలో చేపట్టారు.

మహిళా చైతన్యంతోనే సమాజ ప్రగతి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మహిళలు వృత్తి నైపుణ్యాలలో పట్టు సాధించి, ఆర్థికంగా స్వావలంబన సాధించినప్పుడు మాత్రమే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని కృష్ణ విశ్వవిద్యాలయం రిజిస్టర్ ప్రొఫెసర్ ఎన్ ఉష అన్నారు. కేబీఎన్ కళాశాల అనుబంధ యుజిసి ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో 45 రోజులపాటు నిర్వహించిన వేసవి ఉచిత శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉష మాట్లాడుతూ మహిళ విజ్ఞానవంతురాలు అయితే ఆ కుటుంబం అంతా అభివృద్ధి చెందుతుంది అన్నారు. మహిళా శక్తి ప్రగతికి దిక్సూచి అన్నారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల కోసం 45కి పైగా కోర్సులను ఉచితంగా అందించామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా తమ కళాశాలలో ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది రెండు వేల మంది శిక్షణ పొందారని చెప్పారు. హిందూ హై స్కూల్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ మహిళ విద్యావంతురాలు కావడంతో పాటు అనేక రకాల ఆధునిక నైపుణ్యాలలో కూడా తప్పనిసరిగా నైపుణ్యం సాధించాలన్నారు. పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ అందుకున్న కళాశాల అధ్యాపకుడు డాక్టర్ వి. టి. రామ్ పవన్ ను అతిథులు ఘనంగా సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకృష్ణ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పి ఎల్ రమేష్, ఉమెన్ స్టడీ సెంటర్ కన్వీనర్ శ్రీదేవి పాల్గొన్నారు.